RNI NO: TELTEL2023/46567

# అక్షర వేదం

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం ప్రజల పక్షం AKSHARA VEDAM TELUGU DAILY

విలేకరులు కావలెను

తెలంగాణ ప్రాంతం అన్ని జిల్లాల నుండి స్టాఫ్ రిపోర్టర్లు, జిల్లా ఇన్చార్జులు, మండల రిపోర్టర్లు అర్జెంటుగా కావలెను అనుభవం ఉన్నా లేకున్నా తీసుకోబడును

ఎడిటర్ -పందిళ్ల రవీందర్ (9030653934)

తెలంగాణ స్టేట్ బ్యూరో పొన్నం ప్రసాద్ గౌడ్ 9666992524

సంచిక : 317 | సంపుటి : 02 | సోమవారం 6-10-2025 | పేజీలు -8 | వెల: రూ. 05.00



## నవంబర్ 22లోగా బీహార్ ఎన్నికలు

- బ్యాలెట్‌లో అభ్యర్థుల కలర్ ఫొటోలు
- సిఇసి జ్ఞానేశ్ కుమార్

న్యూఢిల్లీ

నవంబర్ 22 లోగా బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేస్తామని కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ) ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు ఇసిఐ పూర్తి సన్నద్ధంగా ఉందని చెప్పారు. ఇవిఎంల్లో పొందుపరిచే బ్యాలెట్ పేపర్లలో అభ్యర్థుల కలర్ ఫొటోలను పెట్టనున్నామని, కలర్ ఫొటోలు పెట్టడం ఇదే తొలిసారి అని చెప్పారు. రాష్ట్రంలో రెండు రోజుల పర్యటనలో భాగంగా శనివారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించగా.. ఆదివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో ఎన్నికల కమిషన్ సమావేశమైంది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోకమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సింధు, వివేక్ జోషిలతో కలిసి జ్ఞానేష్ కుమార్ మాట్లాడారు. పుట్టిన తేదీ, పౌరసత్వానికి ఆధార్ ధ్రువీకరణ కాదని మరోసారి స్పష్టం చేశారు. చట్టానికి లోబడే ఆధార్‌ను ఉపయోగిస్తున్నామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని, గరిష్ఠంగా 1,200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఉంటుందని చెప్పారు. ఇప్పటికే బూత్ స్థాయి -మిగతా 3 లో



## యుద్ధ విమానాల కింద సమాధి చేస్తాం

- భారత్‌పై పాక్ రక్షణ మంత్రి ప్రేలాపన

న్యూఢిల్లీ,

ఉగ్రవాదాన్ని పెంచి పోషించే చర్యలను నిలిపివేయకపోతే పాకిస్థాన్‌ను ప్రపంచ పటం నుంచి తుడిచిపెడతామని భారత ఆర్మీ చీఫ్ చేసిన హెచ్చరికపై పాకిస్థాన్ స్పందించింది. భవిష్యత్తులో తమపై సైనిక దాడులకు పాల్పడితే భారతదేశానికి చెందిన యుద్ధ విమానాల శకలాల కిందనే ఆ దేశాన్ని భూ స్థాపితం చేస్తామని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ ఆదివారం హెచ్చరించారు. భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ పాకిస్థాన్ తన ఉగ్రవాద ప్రాయోజిత చర్యలను నిలిపివేయాలని ఇటీవల హెచ్చరికలు జారీ చేశారు.దీనిపై ఆసిఫ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ ఈ హెచ్చరికలను భారతదేశ అత్యున్నత భద్రతా వ్యవస్థ నుంచి వచ్చిన కవ్వింపు ప్రకటనలుగా అభివర్ణించారు. ఈ ఏడాది మేలో జరిగిన ఘర్షణలలో ఓటమి పాలైన భారత్ పోయిన తన పరువును పునరుద్ధరించుకునేందుకు -మిగతా 3 లో

# ఆగేనా.. సాగేనా?



## స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ఉత్కంఠ

### నేడు సుప్రీం కోర్టు తీర్పు.. ఎల్లుండి హైకోర్టులో విచారణ





- కోర్టులు అడ్డు చెబితే రిజర్వేషన్లు మారే అవకాశం
- ఇప్పటికే 42శాతం బీసీ రిజర్వేషన్లతో స్థానాలు ఖరారు
- కొందరికి సంతృప్తి.. చాలా చోట్ల సీనియర్ నేతల అసంతృప్తి
- సుప్రీం, హైకోర్టు నిర్ణయాలపై ఆశావహుల ఎదురుచూపు

హైదరాబాద్,

స్థానిక సంస్థల ఎన్నికలపై ఉత్కంఠ నెలకొంది. ఒకవైపు ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటికీ ఎన్నికలు జరుగుతాయా..? కోర్టు జోక్యంతో వాయిదా పడుతాయా..? రిజర్వేషన్లు మారుతాయా..? అనే ఉత్కంఠ నేతల్లో నెలకొంది. బీసీలకు ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఇచ్చిన జీవోను సవాల్ చేస్తూ పలువురు సుప్రీంకోర్టు, హైకోర్టులను ఆశ్రయించటంతో ఎన్నికలపై అనిశ్చితి కొనసాగుతోంది. ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాలో అన్ని స్థానిక సంస్థలకు రిజర్వేషన్లు ఖరారు చేసి, ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. అయితే 42శాతం రిజర్వేషన్లపై అభ్యంతరం వ్యక్తం చేస్తే.. ప్రస్తుత రిజర్వేషన్లు తారుమారయ్యే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. బీసీ సీట్లు తగ్గటంతో పాటు జనరల్ సీట్లు మరిన్ని పెరిగే అవకాశం ఉంది. రిజర్వేషన్లు కలిసి రాక అసంతృప్తితో ఉన్న ఆశావహులు.. కోర్టు తీర్పుపై ఆశగా ఎదురుచూస్తున్నారు. -మిగతా 3 లో

## మా అభ్యంతరాలను గౌరవించాలి

### అమెరికాతో వాణిజ్య చర్చలపై జైశంకర్



న్యూఢిల్లీ,

అమెరికాతో వాణిజ్య వివాదాలను పరిష్కరించుకోవడానికి భారత్ కృషి చేస్తోందని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ తెలిపారు. ఈ చర్చలలో భారత్ వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను అమెరికా గౌరవించాలని ఆయన స్పష్టం చేశారు. అనేక అంశాలపై ఏకాభిప్రాయానికి రాలేకపోవడమే భారతీయ ఎగుమతులపై అమెరికా సుంకాల విధింపునకు దారి తీసిందని ఆయన చెప్పారు.ఆదివారం -మిగతా 3 లో



## 'స్వశక్తి' చీరలతో భరోసా..

- జిల్లా నేతన్నలకు 4.30 కోట్ల మీటర్ల వస్త్ర ఉత్పత్తి ఆర్డర్లు
- 9600పైగా మరమగ్గాల ద్వారా 3.17 కోట్ల మీటర్లు ఉత్పత్తి
- నాణ్యతలో తేడా రాకుండా చర్యలు
- నేడు పరిశీలించనున్న మంత్రి సీతక్క


(సిరిసిల్ల)

సిరిసిల్ల నేతన్నలకు ప్రభుత్వం అందిస్తున్న వస్త్ర ఉత్పత్తి ఆర్డర్లు ఉపాధి భరోసానిస్తున్నాయి. కాలంతో పోటీ పడలేక మరమగ్గాల మధ్యనే బతుకులు వెళ్లదీస్తున్నారు. నిత్యం ఆకలి చావులు, ఆత్మహత్యలు చవిచూసిన సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు గత ప్రభుత్వంలో బతుకమ్మ చీరలు.. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో స్వశక్తి చీరల ఆర్డర్లు నేతన్నలకు బతుకు భరోసా కల్పించాయి. ఇందిరా మహిళా శక్తి పథకంలో తెలంగాణ ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల్లో ఉన్న మహిళలకు ప్రతి సంవత్సరం రెండు చీరలు అందించే విధంగా నిర్ణయించారు. ఆ మేరకు నేతన్నలకు చేతినిండా పని కలిగే విధంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు చీరల ఉత్పత్తి ఆర్డర్లను ఇచ్చారు. బతుకమ్మ పండుగకు స్వశక్తి మహిళలకు చీరలు అందించే దిశగా ఏర్పాట్లు చేసినా పూర్తిస్థాయిలో చీరలు ఉత్పత్తి కాకపోవడంతో వాయిదా పడినట్లు సమాచారం.

-మిగతా 3 లో

## కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లారా జాగ్రత

### పోలీసులు, అధికారులు జాగ్రత్తగా ఉండాలి



- ఎవరెవరు అధికారులు పోలీసోళ్లు ఇబ్బంది పెట్టిర్రో వాళ్ళందరి సంగతి చెబుతాం
- పోయిన పదేళ్లు ఊకున్నాం..ఈసారి అట్లుండదు
- హరీశ్‌రావు వార్నింగ్

హైదరాబాద్,

ఎవరెవరు అధికారులు పోలీసోళ్లు ఇబ్బంది పెట్టిర్రో వాళ్ళందరి సంగతి చెబుతామని హరీశ్‌రావు హెచ్చరించారు. పోలీసులు, అధికారులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పోయిన పదేళ్లు ఊకున్నాం.. ఈసారి అట్లుండదని అన్నారు.ఈసారి అభివృద్ధి చేస్తాం.. ఎక్స్‌ట్రాలు చేసిన అధికారులకు వడ్డీతో సహా చెల్లిస్తామని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన వాళ్లను అరెస్టు చేస్తున్నారని.. కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లారా జాగ్రత్త అని వార్నింగ్ ఇచ్చారు.ఎల్లారెడ్డి నియోజకవర్గం గాంధారి మండలంలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు సమక్షంలో బీజేపీ నుంచి పెద్దఎత్తున కార్యకర్తలు, నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ..రేవంత్ రెడ్డి వచ్చిన తర్వాత పన్నులేసుడు తప్ప కొత్తవి ఇచ్చిందేమీ లేదని హరీశ్‌రావు అన్నారు. మళ్లీ భూముల ధరలు -మిగతా 3 లో



## రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ వర్తింపజేయాలి

- డిప్యూటీ సీఎం భట్టికి వయోధిక పాత్రికేయ సంఘం వినతి

హైదరాబాద్,

కాంగ్రెస్ ఎన్నికల హామీ మేరకు రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ వర్తింపజేయాలని వయోధిక పాత్రికేయ సంఘం విజ్ఞప్తిచేసింది. ఈ మేరకు ఆదివారం సంఘం నేతలు కేశవరావు, లక్ష్మణ్‌రావు, ఎన్ శ్రీనివాస్‌రెడ్డి, బండారు శ్రీనివాసరావు, సీ కేశవులు, ఫాజిల్, వేణుగోపాల్‌తో కూడిన బృందం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ప్రజాభవన్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు

## దగ్గు మందు తయారీపై బీ కేర్‌ఫుల్

- రాష్ట్రాలతో అత్యవసర సమావేశంలో కేంద్రం
- కోల్డ్రిఫ్ దగ్గు మందులో డీఈజీ పరిమితి కన్నా అధికం
- చిన్నారులకు దగ్గు మందు వాడాల్సిన అవసరం లేదు
- నిబంధనలు పాటించని కంపెనీల లైసెన్సులు రద్దు




న్యూఢిల్లీ,

దగ్గు మందు తయారీపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని కేంద్ర ఆరోగ్య శాఖ అన్ని రాష్ట్రాలను ఆదేశించింది. ఆ శాఖ ఆదివారం అత్యవసరంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఆరోగ్య శాఖల కార్యదర్శులు, డ్రగ్ కంట్రోల్ అధికారులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో కోల్డ్రిఫ్ దగ్గు మందును వాడటం వల్ల కనీసం 14 మంది చిన్నారులు మరణించిన నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. భవిష్యత్తులో ఇటువంటి విషాదకర -మిగతా 3 లో

# గాంధేయ మార్గంలో పోరాడండి


### లద్దాఖ్ ప్రజలకు వాంగ్‌చుక్ లేఖ



**అక్షర వేదం న్యూఢిల్లీ,**
కేంద్ర పాలిత ప్రాంతమైన లద్దాఖ్‌లో అలజడి చెలరేగిన అనంతరం అరెస్టయి జోధ్‌పూర్ జైలులో ఉన్న వాతావరణ పరిరక్షణ ఉద్యమ నేత సోనమ్ వాంగ్‌చుక్ ప్రశాంతంగా, సమైక్యంగా ఉండాలని లద్దాఖ్ ప్రజలకు పిలుపునిస్తూ ఓ లేఖ రాశారు. రాష్ట్ర హెూదా కోసం గాంధేయ సిద్ధాంతమైన అహింసా మార్గంలో తమ పోరాటాన్ని కొనసాగించాలని ఆ లేఖలో పిలుపునిచ్చారు.లద్దాఖ్‌కు రాష్ట్ర హెూదా కల్పించాలని డిమాండు చేస్తూ సెప్టెంబర్ 25న నిరసనకారులు ఆందోళన చేపట్టగా హింసాకాండ చెలరేగి లెహ్ పట్టణంలో నలుగురు మరణించడంతో జాతీయ భద్రతా చట్టం కింద వాంగ్‌చుక్‌ని ఎన్ఐఏ అరెస్టు చేసి జోధ్‌పూర్ జైలుకు తరలించింది. కాగా, జాతీయ భద్రతా చట్టం కింద తన భర్తను అక్రమంగా నిర్బంధించడాన్ని సవాలు చేస్తూ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్‌వీ అంజారియాతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టనున్నది.

# చర్మ కణాల నుంచి పిండం అభివృద్ధి!

### అమెరికాలోని ఒరేగాన్ వర్సిటీ ఘనత



**వాషింగ్టన్, -అక్షర వేదం**
అమెరికాలోని ఒరేగాన్ హెల్త్, సైన్స్ వర్సిటీ అద్భుతమైన ఘనత సాధించింది. వర్సిటీలోని శాస్త్రవేత్తలు చర్మకణాల నుంచి మానవ పిండాన్ని అభివృద్ధి చేసే దిశగా కీలక మైలురాయిని దాటారు. మనిషి చర్మ కణంలోని కేంద్రకాన్ని తీసుకుని, దాత అండంలోకి ప్రవేశపెట్టడం ద్వారా సొమాటిక్ సెల్ న్యూక్లియర్ ట్రాన్స్‌ఫర్ అనే పద్ధతిలో పిండం ఆరంభ దశను సృష్టించారు. చర్మ కణంలోని డీఎన్ఏను దాత అండంలోకి ప్రవేశపెట్టడాన్ని సొమాటిక్ సెల్ న్యూక్లియర్ ట్రాన్స్‌ఫర్ అని పిలుస్తారు.మొత్తం 82 అండాలను తయారు చేయగా వీటిలో 8 వరకు పిండం ఆరంభ దశ అయిన బ్లాస్టోసిస్ట్ దశ వరకు అభివృద్ధి చెందగలిగాయి. ఈ పరిశోధన ద్వారా శాస్త్రవేత్తలు అండాలలోని క్రోమోజోమ్‌ల సంఖ్యను సగానికి తగ్గించడం అనే మైటోమియాసిస్ దశను ఉపయోగించారు. తయారు చేసిన పిండాలలో కొన్నింటిలో జన్యుపరమైన సమస్యలు ఉన్నాయని, మరిన్ని పరిశోధనలు జరగాల్సిన అవసరముందని శాస్త్రవేత్తల బృందం తెలిపింది. తక్కువ అండాలు కలిగిన వారు, క్యాన్సర్ బాధితులు, స్వలింగ దంపతులు సొంత జన్యుపరమైన సంతానాన్ని పొందేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని చెప్పారు.

# పాకిస్థాన్‌కు రష్యా జెట్ ఇంజిన్‌లు..

### తప్పుడు ప్రచారమని కొట్టిపారేసిన మాస్కో




**న్యూఢిల్లీ, -05 అక్టోబర్ అక్షర వేదం**
పాకిస్థాన్ యుద్ధ విమానాల కోసం రష్యా జెట్ ఇంజిన్ల ను సరఫరా చేస్తున్నట్లు వస్తున్న వార్తలను మాస్కో కొట్టి పారేసింది. ఆ దేశంతో అలాంటి ఒప్పందం తాము చేసుకోలేదని రష్యా ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. భారత్‌తో పెద్దఎత్తున వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్న సమయంలో.. పాకిస్థాన్‌కు తాము జెట్ ఇంజిన్‌లను సరఫరా చేస్తున్నట్లు ప్రచారం చేయడం సరికాదన్నారు. భారత్‌కు ఇబ్బందికరంగా మారే ఏ చర్యలు తాము చేపట్టబోమని స్పష్టంచేశారు.అయితే ఈ విషయంపై రష్యా ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. పాకిస్థాన్‌లో ఉన్న చైనా తయారీ JF-17 ఫైటర్ జెట్లలో వాడే ఇంజిన్లను రష్యా సరఫరా చేస్తోందని పలు అంతర్జాతీయ మీడియా సంస్థలు పేర్కొన్నాయి. దాంతో అంతర్జాతీయ మీడియా నివేదికలను ఉటంకిస్తూ ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ బీజేపీపై తీవ్ర విమర్శలు చేసింది.ప్రధాని మోదీ రష్యాను అత్యంత సన్నిహితమైన వ్యాపార భాగస్వామిగా చెబుతారని, కానీ ఆ దేశం మన శత్రు దేశమైన పాకిస్థాన్‌కు మద్దతునిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ ఆరోపించారు. ఇది ఇతర దేశాలతో సంబంధాల విషయంలో ప్రధాని మోదీ వైఫల్యాన్ని సూచిస్తోందని విమర్శించారు. మోదీ సర్కారు పాకిస్థాన్‌ను ఒంటరిని చేయలేకపోతోందని మండిపడ్డారు.

# గంటకు 2.21లక్షల కిలోమీటర్ల వేగంతో అట్లాస్ తోకచుక్క ప్రయాణం..

## నాసా ఏం చెప్పిందంటే..?

**న్యూఢిల్లీ, -05 అక్టోబర్ అక్షర వేదం**
సౌరకుటుంబం ఆవల నుంచి వేగంగా దూసుకువస్తున్న '3ఐ/అట్లాస్ అనే తోకచుక్కతో భూమికి ఎలాంటి ప్రమాదం లేదని నాసా స్పష్టం చేసింది. సెకనుకు 61 కిలోమీటర్ల (అంటే గంటకు సుమారు 2.21 లక్షల కిలోమీటర్ల వేగం) అసాధారణ వేగంతో ఈ తోక చుక్క ప్రయాణిస్తుంది. ప్రస్తుతం ఈ తోకచుక్క కదలికలను నిరంతరం గమనిస్తున్నామని.. దాంతో భూమికి ఎలాంటి ప్రమాదం ఉండబోదని పేర్కొంది. మన సౌర వ్యవస్థకు చెందని ఖగోళ వస్తువులను గుర్తించడం ఇది మూడోసారి. గతంలో 2017లో 'ఔముఆముఆ', 2019లో '2ఐ/బోరిసోవ్'ని శాస్త్రవేత్తలు గుర్తించారు. తాజాగా అట్లాస్ తోకచుక్క సౌరకుటుంబం ఆవల నుంచి వస్తున్న మూడో అతిథిగా పేరుకుంటున్నారు. దాని పేరులో 'ఐ' అక్షరం 'ఇంటర్‌స్టెల్లార్'ని సూచిస్తున్నది. ఈ తోకచుక్కను తొలిసారిగా ఈ ఏడాది జులై 1న



చిలీలోని రియో హర్టాడోలో ఉన్న అట్లాస్ టెలిస్కోప్ ద్వారా శాస్త్రవేత్తలు గుర్తించారు.ఈ తోకచుక్క సూర్యుడికి దగ్గరయ్యే కొద్దీ దీని వేగం మరింత పెరుగుతుంది నాసా పేర్కొంది. అక్టోబర్ 30 నాటికి ఇది సూర్యుడికి అత్యంత సమీపంగా.. అంటే సుమారు 21 కోట్ల కిలోమీటర్ల దూరానికి చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఇది అంగారక గ్రహ కక్ష్యకు కొద్దిగా లోపలి భాగంలో ఉంటుంది. భూమికి, ఈ తోకచుక్కకు మధ్య దూరం చాలా ఎక్కువగా ఉంటుందని నాసా క్లారిటీ ఇచ్చింది. ఈ తోకచుక్క భూమికి అత్యంత దగ్గరగా వచ్చినప్పుడు కూడా దాని దూరం సుమారు 27 కోట్ల కిలోమీటర్లు ఉంటుందని.. కాబట్టి భూమికి దీనివల్ల ఎలాంటి ముప్పు లేదని తెలిపింది. హబుల్, జేమ్స్ వెబ్ వంటి శక్తిమంతమైన టెలిస్కోపుల ద్వారా దీని గమనాన్ని నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. అక్టోబర్ చివరిలో సూర్యుడి దగ్గర నుంచి ప్రయాణించి, మార్చి 2026 నాటికి బృహస్పతిని దాటి తిరిగి మన సౌర వ్యవస్థ నుంచి శాశ్వతంగా దూరంగా వెళ్లిపోతుందని శాస్త్రవేత్తలు అంచనా వేశారు.


# అదనపు కట్నం కోసం గర్భిణి దారుణ హత్య

### రూ.5 లక్షల కోసం కొట్టి చంపిన భర్త




**లక్నో, -05 అక్టోబర్ అక్షర వేదం**
అదనపు కట్నం కోసం భర్త, అత్తింటి వారు కలిసి గర్భిణి అని కూడా చూడకుండా ఒక మహిళను దారుణంగా కొట్టి చంపిన ఘటన బీజేపీ పాలిత యూపీలో చోటుచేసుకుంది. మణిపూర్‌లోని గోపాల్‌పూర్ గ్రామంలో ఈ దారుణం జరిగిందని పోలీసులు ఆదివారం తెలిపారు.రంగ్‌పూర్ గ్రామానికి చెందిన బాధితురాలు రజినీ కుమారి (21) వివాహం సచిన్‌తో ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగింది. పెళ్లయిన కొద్ది రోజులకే టెంట్ హౌస్ వ్యాపారం కోసం రూ.5 లక్షల అదనపు కట్నం తెమ్మని భర్త, అత్తింటివారు డిమాండ్ చేశారు. ఆమె ఆ డబ్బును తేలేకపోవడంతో శుక్రవారం ఆమె భర్త, అతని సోదరులు, బంధువులు గర్భిణి అయిన కుమారిని దారుణంగా హింసించి చంపేశారు. తర్వాత గుట్టుచప్పుడు కాకుండా వారి పొలంలోనే ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు భర్త సహా ఆరుగురిపై కేసు నమోదు చేశారు. నిందితుల కోసం గాలిస్తున్నారు.

# బస్తర్‌లో 10 వేల రేడియోల పంపిణీ



**బీజాపూర్ -05 అక్టోబర్ అక్షర వేదం**
నక్సల్స్ ప్రాబల్యం అధికంగా ఉండే ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్ 10 వేలకు పైగా రేడియోలను ఉచితంగా పంపిణీ చేసింది. హింసాత్మక వామపక్ష తీవ్రవాదం తగ్గుముఖం పడుతున్న ఈ ప్రాంతంలో స్థానికులను మావోయిస్టుల భావజాలం నుంచి దూరం చేయడానికి, జాతీయతను వ్యాప్తి చేయడానికి నిర్వహించిన ప్రత్యేక ప్రచారంలో భాగంగా వీటిని పంపిణీ చేశారు. 180 సీఆర్‌పీఎఫ్ కంపెనీల ద్వారా 10,800 రేడియో సెట్లను గ్రామస్థులకు అందజేసినట్టు అధికారులు తెలిపారు. స్థానికులు, గిరిజనులను ప్రధాన స్రవంతిలోకి అనుసంధానించడం ఈ మెగా రేడియో పంపిణీ డ్రైవ్ ముఖ్య లక్ష్యమని ఆయన వివరించారు.

# విజయ్ ప్రచార వాహనం డ్రైవర్‌పై కేసు

**చెన్నై,-05 అక్టోబర్ అక్షర వేదం**
కరూర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించి టీవీకే అధినేత విజయ్ ప్రచార వాహనం డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. విజయ్ ఉపయోగించిన ప్రచార బస్సుపైనా ఎఫ్ఐఆర్ నమోదుచేసినట్టు పోలీసులు తెలిపారు. సెప్టెంబర్ 27న కరూర్‌లో విజయ్ చేపట్టిన ర్యాలీలో తొక్కిసలాట చోటుచేసుకోగా, 41మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన యావత్ దేశాన్ని షాక్‌కు గురి చేసింది. నటుడు విజయ్ ఉపయోగించిన ప్రచార బస్సు కరూర్ ర్యాలీకి సమీపంలో రెండు మోటార్ సైకిళ్లను ఢీ కొన్న




విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. ఇందుకు సంబంధించిన వీడియో క్లిప్‌లు సోషల్ మీడియాలో ప్రసారమయ్యాయి. దీనిపై స్పందించిన మద్రాస్ హైకోర్టు పోలీసుల నిష్క్రియాపరత్వంపై ఆందోళన వ్యక్తం చేసింది.

**సిట్ దర్యాప్తు షురూ**
కరూర్‌లో టీవీకే చీఫ్ విజయ్ ప్రచార ర్యాలీలో చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటనపై 'సిట్' దర్యాప్తు ఆదివారం మొదలైంది. సిట్‌లో తనతోపాటు మరో ఇద్దరు ఐపీఎస్ స్థాయి అధికారులు సహా 11మంది పోలీసు అధికారులు ఉన్నారని సిట్ ప్రధాన అధికారి గార్గ్ చెప్పారు. ఘటనాస్థలాన్ని సిట్ అధికారులు పరిశీలించారు.

# ఖలిస్థానీ ఉగ్రవాదులకు నిధులపై నిఘా పెట్టిన కెనడా

**న్యూఢిల్లీ, -05 అక్టోబర్ అక్షర వేదం**
ఖలిస్థానీ వేర్పాటువాద సంస్థల నెట్‌వర్క్‌కు నిధులు వస్తున్న మార్గాలపై కెనడా ఇంటెలిజెన్స్ వర్గాలు నిఘా వేశాయి. కెనడాలోని సేవా సంస్థలకు వస్తున్న నిధులను ఉగ్ర కార్యకలాపాలకు మళ్లిస్తున్నారన్న ఆరోపణలతో కెనడా సర్కారు ఈ నిర్ణయం తీసుకుంది. కెనడా ఆర్థికశాఖకు చెందిన మోర్సో నివేదిక ఖలిస్థానీ ఉగ్రవాదాన్ని హమాస్, హెజ్‌బొల్లాతో పోల్చింది. వేర్పాటువాదులు సేవా సంస్థల నిధులను ఉగ్ర కార్యకలాపాలకు వాడుతున్నారని ఆరోపించింది.స్థానిక రేడియో స్టేషన్ అధిపతి మణీందర్ ఆ దేశ ప్రధాని మార్క్ కార్నీ సహా పలువురు నాయకులకు కొన్నాళ్ల క్రితం లేఖ రాశారు. సామాజిక సేవకు వచ్చే విరాళాల దుర్వినియోగంపై ఫిర్యాదు చేశారు. గత పాలకులు దీనిపై చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని వెల్లడించారు. కెనడాలోని నాన్‌ప్రాఫిట్ ఆర్గనైజేషన్‌లో




ఉగ్ర స్లీపర్ సెల్స్ ఉంటున్నాయనే అనుమానాలు వ్యక్తంచేశారు.ఇప్పటికే బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ ఉగ్ర సంస్థ సభ్యుడు తల్వీందర్ సింగ్ పర్మర్ కుమారుడు సురిందర్ సింగ్ పర్మర్ కేసు ఈ కోవలోనే పరిశీలిస్తున్నారు. సురిందర్ కెనడాలోని నాన్ ప్రాఫిట్ సంస్థలోనే పనిచేస్తున్నాడు. ఆ సమయంలో అతడు తన పూర్తి పేరును వెల్లడించలేదని తేలింది. ఇతడికి కూడా బబ్బర్ ఖల్సాతో సంబంధాలున్నాయి.ఈ నేపథ్యంలో కెనడా ప్రభుత్వం ఈ అంశంపై నిర్ణయాత్మకంగా వ్యవహరించాలని భావిస్తోంది. ఛారిటబుల్ సంస్థలకు వచ్చే నిధుల దుర్వినియోగంపై దృష్టి పెట్టనుంది. మరోవైపు భారత్-కెనడా భద్రతా సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించుకొన్నాయి. ఈ క్రమంలోనే కెనడా లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఉగ్ర సంస్థగా ప్రకటించింది.

# నవంబర్ 22లోగా బీహార్ ఎన్నికలు

(మొదటి తరువాయి)

అధికారులకు శిక్షణ పూర్తి చేశామని, ఎన్ని దశల్లో పోలింగ్ నిర్వహించాలనే దానిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. బ్యాలెట్ పేపర్లలో అభ్యర్థుల కలర్ ఫొటోలను ఉంచడం తద్వారా అభ్యర్థులను ఓటర్లు తేలికగా గుర్తుపట్టేందుకు వీలుంటుందని తెలిపారు. సీరియల్ నంబర్ కూడా పెద్దగా కనిపించేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. తదుపరి ఎన్నికల నుంచి దేశవ్యాప్తంగా సీరియల్ నెంబర్ ఫాంట్లు పెద్దవిగా ఉండేలా, అభ్యర్థుల ఫొటోలు కలర్‌లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బీహార్‌లో 22 ఏళ్ల తరువాత స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) చేపట్టామని చెప్పారు. 243 నియోజకవర్గాల్లో ఒక్కోదానికి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈవోఆర్) ఉన్నారని, ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి వారికి 90,207 మంది బూత్ లెవల్ ఆఫీసర్లు (బిఎల్‌వో) సహాయం చేశరాని తెలిపారు. ఎస్ఐఆర్‌తో అనర్హులను జాబితా నుంచి తొలగించామని, దీన్ని బీహార్ ఓటర్లు కూడా స్వాగతించారని పేర్కొన్నారు. వీటిపై ఏమైనా అభ్యంతరాలుంటే తెలిపేందుకు రాజకీయ పార్టీలకు ఇంకా అవకాశం ఉందన్నారు. ఛాత్ పండుగను ఎంత ఉత్సాహంగా జరుపుకుంటామో అంతే ఉత్సాహంతో బీహార్ ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

వరుస సమావేశాలు

ఆదాయం పన్ను శాఖ, పోలీసు శాఖ, ఇతర ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో ఎన్నికల కమిషన్ ఆదివారం వరుస సమావేశాలు జరిపింది. స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన కార్యాచరణ పథకంపై సమీక్ష జరిపింది. అనంతరం చీఫ్ ఎలక్టోరల్ అధికారులు, రాష్ట్ర పోలీస్ నోడల్ అధికారి, సెంట్రల్ సెక్యూరిటీ ఫోర్స్ ప్రతినిధులతో సమావేశమైంది. ఆ వెంటనే చీఫ్ సెక్రటరీ, డెరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఇతర బ్యూరోక్రాట్లతో రాష్ట్రస్థాయిలో సమన్వయంపై సమీక్ష జరిపింది.

# యుద్ధ విమానాల కింద సమాధి చేస్తాం

(మొదటి తరువాయి)

భారతీయ సైనిక, రాజకీయ నాయకులు చేసిన విఫల యత్నంగా వారు చేసిన తాజా ప్రకటనలని ఆయన వ్యాఖ్యానించారు. 0–6 స్కోరుతో ఓటమిపాలైన భారత నాయకులు మరోసారి అటువంటి ప్రయత్నం చేస్తే ఈసారి స్కోరు మరింత పెరుగుతుందని ఆయన నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ 0–6 స్కోరు గురించి ఆయన విశదీకరించలేదు.

# మా అభ్యంతరాలను గౌరవించాలి

(మొదటి తరువాయి)



కౌటిల్య ఎకనమిక్ కాంక్లేవ్(కేఈసీ 2025)లో జైశంకర్ ప్రసంగిస్తూ తమ వాణిజ్య చర్చలలో ఏకాభిప్రాయం కుదరనందునే నేడు అమెరికాతో కొన్ని సమస్యలు ఉన్నాయని అన్నారు. భారత్‌పై అమెరికా విధించిన సుంకాలను అన్యాయంగా అభివర్ణించిన ఆయన భారతీయ వస్తువులపై విధించిన 50 శాతం సుంకాలను వ్యతిరేకిస్తూ భారత్ చర్చలు జరుపుతోందని చెప్పారు.

# కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లారా జాగ్రత్త..

(మొదటి తరువాయి)

పడిపోయాయని తెలిపారు. బీర్ల ధరలు, విస్కీ ధరలు పెంచిందని తెలిపారు. ఆడోళ్లకి ఫ్రీ బస్సు అన్నాడు.. మొగోళ్లకు డబల్ టికెట్ కొడుతున్నారని తెలిపారు. కేసీఆర్ తెచ్చిన పథకాలను బందు పెట్టిండు.. న్యూట్రిషన్ కిట్టు బందు.. కేసీఆర్ కిట్టు బందు.. బతుకమ్మ చీరలు బంద్ అయినాయన్నారు. కేసీఆర్ ఉండంగా ఎట్ల ఇచ్చిండు.. రేవంత్ రెడ్డి ఎందుకు బంద్ చేసిండు అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డిది కేవలం దోచుకునే ప్రభుత్వమని విమర్శించారు. మల్ల ఎటు చూసినా కేసీఆర్ రావాలనే గాలి మొదలైందని హరీశ్‌రావు తెలిపారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ప్యాకేజి తెస్తా ప్యాకేజీ తెస్తా అన్నాడు.. రేవంత్ రెడ్డి వచ్చి ప్యాకేజ్ ఇస్తా అన్నాడు అని తెలిపారు. వరదలు వచ్చి రోజులు దాటినా ఒక్క రూపాయి అయినా రేవంత్ రెడ్డి ఇచ్చాడా అని ప్రశ్నించారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 10,000 ఇస్తామన్నారని.. ఒక రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. తొందర్లో కాంగ్రెస్ బాకీ కార్డులు కూడా నియోజకవర్గానికి వస్తాయన్నారు. ప్రతి ఇంటికి బాకీ కార్డులను చేర్చాలని సూచించారు. ప్రతి అక్కకు చెల్లెకు మహాలక్ష్మి కింద నెలకు 2500 ఇస్తానన్నాడని హరీశ్‌రావు తెలిపారు. 22 నెలలు నిండినై.. ఒక్కొక్క మహిళకు 55 వేల రూపాయలు కాంగ్రెస్ పార్టీ బాకీ పడిందని అన్నారు. ఎవరైనా కాంగ్రెస్ వాడు ఊర్లకు వస్తే 55 వేల రూపాయలు ఇచ్చి మాట్లాడండి అని గల్ల పట్టి నిలదీయాలన్నారు. 200 పెన్షన్ 2000 చేసింది కేసీఆర్ అని తెలిపారు. కేసీఆర్ ఇస్తున్న రెండు వేల పెన్షన్‌ను నాలుగు వేలు చేస్తానని రేవంత్ రెడ్డి అన్నాడని గుర్తుచేశారు. అవ్వకిస్తా, తాతకిస్తా, కోడలికిస్తా అన్నాడని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో వృద్ధులకు 44వేల రూపాయలు బాకీ పడిందని అన్నారు. రైతుబంధు 15వేలు ఇస్తా అన్నారని హరీశ్‌రావు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ 15 వేలు ఇచ్చిందా అని ప్రశ్నించారు. పోయిన యాసంగికి 3 ఎకరాలకు ఇచ్చి మిగితా ఎగ్గొట్టిండని విమర్శించారు. కౌలు రైతుకి ఇస్తా, రైతుకి ఇస్తా అన్నాడని తెలిపారు. రైతుకు లేదు.. కౌలు రైతుకు లేదని అన్నారు. ఒక సంవత్సరంలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తా అన్నాడని.. కానీ 5 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని తెలిపారు. రేవంత్ రెడ్డి అంటే చీఫ్ మినిస్టర్ కాదు.. కటింగ్ మాస్టర్ అని ఎద్దేవా చేశారు. పథకాలు కటింగ్ పెడుతాడు. కేసీఆర్ కట్టిన బిల్డింగ్ లకు రిబ్బన్ కత్తిరిస్తారని అన్నారు.

# ఆగేనా..సాగేనా?

(మొదటి తరువాయి)

**రిజర్వేషన్ల ఖరారుతో జోష్**

స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించింది. తొలి విడత పరిషత్ ఎన్నికల కోసం ఈ నెల 9వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 75 జడ్పీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు చేశారు. వీటితో పాటు 764 ఎంపీటీసీలు, 1,653 గ్రామపంచాయతీలు, 14,786 వార్డులకు రిజర్వేషన్లను ఖరారు చేశారు. దీంతో బీసీలకు భారీ సంఖ్యలో పోటీ అవకాశం ఏర్పడింది. దీంతో గ్రామాలు, మండలస్థాయిలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. కొత్తగా ఖరారైన రిజర్వేషన్లతో ఆశావహులు చాలామంది అధికార, ప్రతిపక్ష పార్టీల నుంచి తామే అభ్యర్థులమనే ప్రచారం చేసుకుంటున్నారు. ఇప్పటికే గ్రామాల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులు ఎవరనే చర్చ ప్రజల్లో మొదలైంది. ఎవరెవరు బరిలో ఉంటన్నారు..? ఎవరు గెలిచే అవకాశాలున్నాయని ఆరా తీస్తున్నారు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. అభివృద్ధి, సంక్షేమం పేరుతో కాంగ్రెస్ ఓటర్లకు వల వేసేలా వ్యూహ రచన చేస్తుంటే.. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, కాంగ్రెస్ బాకీ కార్డు పేరుతో బీఆర్ఎస్ ప్రజల్లోకి వెళుతోంది.

అభ్యర్థుల వేట

స్థానిక ఎన్నికలపై దృష్టిపెట్టిన కాంగ్రెస్ పార్టీ.. జడ్పీటీసీ స్థానానికి పోటీ పడే ముగ్గురు పేర్లతో అభ్యర్థుల జాబితాను ఇప్పటికే అధిష్ఠానానికి పంపించారు. ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థులను జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేల సమక్షంలో ఎంపిక చేయనున్నారు. మరోవైపు వర్ధన్నపేట, పాలకుర్తి, భూపాలపల్లి, నర్సంపేట, పరకాల అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో బీఆర్ఎస్ నేతలు పంచాయతీ, వార్డుల వారీగా సమావేశాలు నిర్వహించి గులాబీ శ్రేణుల్లో జోష్ నింపేలా ప్రచారం చేస్తున్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆరు జడ్పీలు బీఆర్ఎస్ ఖాతాలోనే ఉన్నాయి. వాటిలో మెజారిటీ జడ్పీ పీఠాలను కైవసం చేసుకోవాలని గులాబీ నేతలు కసరత్తు చేస్తున్నారు. ఇక బీజేపీ సైతం అభ్యర్థుల ఎంపికపై దృష్టి పెట్టింది. మూడు ప్రధాన పార్టీలు స్థానిక సంస్థల్లో సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతున్నాయి. మరోవైపు ఆశావహులు గ్రామాల్లో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. సద్దుల బతుకమ్మ, దసరా పండుగల్లో రాజకీయ ఉనికి చాటుకునే దిశగా వినూత్న కార్యక్రమాలు చేపట్టారు. అయితే ఈ రిజర్వేషన్లు ఉంటాయా..? ఉండవా..? అన్న దానిపై స్పష్టత లేకపోవడం ఆశావహులను ఉత్కంఠకు గురిచేస్తున్నాయి. ఓ వైపు తాము బరిలో ఉంటామనే సంకేతాలు ఇస్తూనే.. ఖర్చుల విషయంలో చాలామంది వెనుకడుగు వేస్తున్నారు. పోటీదారులు దసరా దావత్‌లకు దూరంగానే ఉంటూ రాజకీయం నడిపినట్లుగా అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి.

రిజర్వేషన్ల ఝులక్

పదేళ్ల తరువాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. దీంతో చాలామంది ద్వితీయ శ్రేణి నేతలు తమ అదృష్టాన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో పరీక్షించుకునేందుకు ఆరాటపడుతున్నారు. ఈ క్రమంలో రిజర్వేషన్లు ఆశావహుల ఆశలపై నీళ్లు చల్లాయి. ప్రధానంగా జనరల్, బీసీ కోటాలో పాగా వేయాలని ఆశించిన నేతలకు జడ్పీ చైర్మన్ పదవులు మింగుడు పడటం లేదు. ములుగు జిల్లాకు సంబంధించిన ఓ కీలక నేత జడ్పీ చైర్మన్ పదవిపై కన్నేశారు. అయితే అనూహ్యంగా ఎస్టీ మహిళకు ములుగు జడ్పీ పీఠం రిజర్వుడు కావటంతో సదరు నేతలకు ఆశాభంగం కలిగింది. హనుమకొండ జడ్పీ పీఠంపై కూడా కాంగ్రెస్, బీఆర్ఎసలో కీలక నేతలు కన్నేశారు. అయితే ఎస్సీ మహిళకు హనుమకొండ జడ్పీ పీఠం రిజర్వుడు కావటంతో సదరు నేతలు నిరాశకు గురయ్యారు. వరంగల్, జనగామ జడ్పీ చైర్మన్‌లు కూడా రిజర్వేషన్ కోటాలో పోవటంతో ఎన్నో ఏళ్లుగా ఆశతో ఉన్న నేతలకు రిజర్వేషన్లు ఝులక్ ఇచ్చాయి. ఇలా జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు కూడా రిజర్వేషన్లు కలిసి రాకపోవటంతో అనేక మంది ఆశావహులు మానసికంగా కుంగిపోతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ 42శాతం రిజర్వేషన్లపై కొందరు కోర్టును ఆశ్రయించటంతో ఆశావహుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఏదైనా జరిగితే తమకు అనుకూలంగా రిజర్వేషన్లు మారుతాయనే ఆశతో కొందరు నేతలు ఉన్నారు. మరోవైపు బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ప్రకటించిన క్రమంలో కేవలం భూపాలపల్లి జడ్పీ చైర్మనే బీసీలకు కేటాయించారు. ఆరు జడ్పీల్లో కేవలం ఒక్క స్థానమే కేటాయించారని బీసీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కోర్టు తీర్పుపై ఉత్కంఠ

కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం ఇటీవల జీవో విడుదల చేసింది. ఇప్పటికే ఎస్సీ, ఎస్టీలకు 27శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. వీటికి 42 శాతం బీసీ రిజర్వేషన్లు కలిపితే 69 శాతం రిజర్వేషన్లు అవుతాయి. రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు 50శాతం మించకూడదని గతంలో సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో సోమవారం సుప్రీంకోర్టులో తెలంగాణలో స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై విచారణ జరుగనుంది. ఈ క్రమంలో సుప్రీంకోర్టు ఎలాంటి తీర్పు ఇస్తుందో అనే ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుత పరిస్థితుల్లో పెంచిన రిజర్వేషన్లకు కోర్టు బ్రేకులు వేస్తే ఎలా అనే చర్చ నడుస్తోంది. తీర్పును మరో తేదీకి వాయిదా వేస్తే.. తుది తీర్పు వచ్చే దాకా ప్రభుత్వం ఎదురుచూడక తప్పదని మరికొందరు పేర్కొంటున్నారు. ఒక వేళ కోర్టులో కేసు పెండింగ్ ఉండగానే ఎన్నికలకు వెళ్తే.. ఆ ఎన్నికలు సైతం కోర్టు రద్దుచేయొచ్చని, మహారాష్ట్రలో ఇలాంటి సంఘటనే జరిగిందని బీజేపీ నేత, ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పుపై రాజకీయాల్లో ఉత్కంఠ నెలకొంది. సాంకేతికంగా సాధ్యం కాకుంటే ఇటీవల ఖరారైన రిజర్వేషన్లు మారడం తప్పనిసరిగా కనిపిస్తోందనే ప్రచారం ఉంది. ఒకవేళ ఇదే జరిగితే బీసీలకు మళ్లీ పాత రిజర్వేషన్లే దిక్కయ్యే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీ పరంగా 42శాతం రిజర్వేషన్లు అమలు చేయవచ్చననే ప్రచారం కూడా జరుగుతోంది. మొత్తానికి స్థానిక సంస్థల ఎన్నికలపై కోర్టు తీర్పు ప్రభావం ఉండటంతో అందరి దృష్టి సోమవారం సుప్రీంకోర్టు, 8వ తేదీన హైకోర్టు ఇచ్చే తీర్పులపై ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

# 'స్వశక్తి' చీరలతో భరోసా..

(మొదటి తరువాయి)

సిరిసిల్లలో చీరల ఉత్పత్తిని గత ఆగస్టు 15లోగానే పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినా పూర్తి కాకపోవడంతో సెప్టెంబరు 30 వరకు పొడిగించిన ఆ గడువు కూడా ముగిసింది. ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్లు సిరిసిల్లలో మరమగ్గాలపై వస్త్ర ఉత్పత్తి చివరి దశకు చేరుకోవడంతో స్వశక్తి మహిళలకు చీరలు అందించే విధంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సోమవారం స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క బతుకమ్మ చీరల ఉత్పత్తిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించనున్నారు.

**మరమగ్గాల కార్మికులకు చేతి నిండా పని..**

సిరిసిల్ల మరమగ్గాల కార్మికులకు చేతినిండా ఉపాధి కలుగుతుందనే ఆలోచనతో చీరల ఉత్పత్తి ఆర్డర్లను అందించారు. నాణ్యతలో ఎలాంటి తేడా రాకుండా పలు చర్యలు తీసుకున్నారు. స్వశక్తి మహిళకు డ్రెస్ కోడ్‌గా ఉండే విధంగా ఉత్పత్తి చేసిన చీరలను పంపిణీ చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఉత్పత్తి చేసిన వస్త్రాన్ని ప్రాసెసింగ్, ప్రింటింగ్ పూర్తిచేసి వివిధ జిల్లాల్లోని గోదాముల్లో నిల్వ చేస్తున్నారు. మహిళలకు అందించే స్వశక్తి చీరను సిరిసిల్లలో ఆగస్టులో చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఆర్డర్లు అందించే ముందే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిజైన్లు పరిశీలించి ఖరారు చేశారు. గత ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరల ఆర్డర్లు 2017 నుంచి 2023 వరకు ఇచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బతుకమ్మ చీరల్లో నాణ్యత లేదని నిలిపివేసింది. ప్రభుత్వం నుంచి ఆర్డర్లు లేకపోవడంతో వస్త్ర పరిశ్రమ ఒక్కసారిగా సంక్షోభంలో కూరుకుపోయింది. నేతన్నల ఆత్మహత్యలు, కార్మిక సంఘాల ఆందోళనలు, అనేక విషాద సంఘటనల మధ్య ప్రభుత్వం మళ్లీ సిరిసిల్ల నేతన్నల ఉపాధిని దృష్టిలో పెట్టుకొని నాణ్యమైన చీరలను ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా స్వశక్తి సంఘాల మహిళలకు డ్రెస్ కోడ్‌గా ఉండే విధంగా నాణ్యమైన చీరలను ఉత్పత్తి చేయడానికి నిర్ణయించింది. ఇందులో భాగంగా సిరిసిల్ల మరమగ్గాల కార్మికుల పని కల్పించే దిశగా ఆర్డర్లను ఇవ్వడంతో కార్మికులకు నిరంతరంగా ఉపాధి కలుగుతుందని భరోసా వచ్చింది.

ఫ 3.17 కోట్ల మీటర్ల 'స్వశక్తి' బట్ట ఉత్పత్తి..

స్వశక్తి మహిళలకు ఏడాదికి రెండు చీరలు ఇచ్చే విధంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఆర్డర్లు ఇచ్చారు. మొదటి విడతగా ఈ సంవత్సరం జనవరి, మార్చి మాసంలో 4.30 కోట్ల మీటర్ల వస్త్ర ఉత్పత్తి ఆర్డర్లు రావడంతో మరగ్గాల చప్పుళ్లు మళ్లీ నిరంతరం వినిపిస్తున్నాయి. సిరిసిల్ల మరమగ్గాలపైన 1.30 కోట్ల మీటర్ల చీరల ఉత్పత్తి జరుగుతోంది. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో కార్మికుల కొరత తీవ్రంగా ఉండడంతో స్వశక్తి చీరలు ఉత్పత్తి మొదట్లో వేగంగా జరగలేదు. తరువాత ఉత్పత్తి లక్ష్యం దిశగా వేగం పుంజుకుంది. గతంలో బతుకమ్మ చీరల ఉత్పత్తి కోసం తెలంగాణలోని వరంగల్, జగిత్యాల, నల్లగొండ, వికారాబాద్ లాంటి జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా నేత కార్మికులు సిరిసిల్లకు వచ్చి ఉపాధి పొందారు. బతుకమ్మ చీరలు ఉత్పత్తి ఆర్డర్లు రాకపోవడంతో కార్మికులు మహారాష్ట్రలోని బీవండి, షోలాపూర్, గుజరాత్‌లోని సూరత్ వంటి ప్రాంతాలకు వెళ్లారు. మరికొందరు ఇతర పనుల్లో స్థిరపడ్డారు. దీంతో స్వశక్తి చీరల ఉత్పత్తి ఇబ్బందికరంగా మారింది. సిరిసిల్లలో దాదాపు 30వేల వరకు మరమగ్గాలు ఉన్నాయి. ఇందులో జియోట్యాగింగ్ చేసిన మరమగ్గాలు 27 వేల వరకు ఉన్నాయి. ఇందులో స్వశక్తి చీరల ఉత్పత్తి 131 మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ(మ్యాక్స్)ల ద్వారా 9600 మరమగ్గాలపైన ఉత్పత్తి జరుగుతోంది. ఇప్పటివరకు 4.30కోట్ల మీటర్ల వస్త్ర ఉత్పత్తి ఆర్డర్‌లో 3.17 కోట్ల మీటర్లు ఉత్పత్తి జరిగింది. మరో వారం రోజుల్లో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోనున్నారు.

# దగ్గు మందు తయారీపై బీ కేర్‌ఫుల్

(మొదటి తరువాయి)

సంఘటనలు పునరావృతం కాకుండా చూడటం కోసం మందులను సహేతుకంగా సూచించేలా, నిఘా వ్యవస్థలను విస్తరించేలా చర్యలు తీసుకోవాలని కేంద్రం చెప్పింది. రివైజ్డ్ షెడ్యూల్ ఎమ్‌ను కట్టుదిట్టంగా పాటించాలని ఔషధాల తయారీ కంపెనీలన్నిటికీ చెప్పింది. దీనిని పాటించని కంపెనీల లైసెన్సులు రద్దవుతాయని హెచ్చరించింది. వైద్యులు దగ్గు మందులను సూచించేటపుడు హేతుబద్ధంగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలకు కేంద్రం తెలిపింది. ముఖ్యంగా చిన్నారులకు మందులను సూచించేటపుడు జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పింది. బాల్యంలో వచ్చే దగ్గు చాలా వరకు దానంతట అదే తగ్గుతుందని, ఔషధపరమైన చికిత్స అవసరం ఉండదని గుర్తు చేసింది. నిఘాను పెంచాలని, ఆరోగ్య కేంద్రాల్లో ఏమైనా ప్రతికూల పరిస్థితులు, సంఘటనలు జరిగితే, వెంటనే సకాలంలో తెలియజేయాలని చెప్పింది. ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్‌ఫామ్ కిందనున్న కమ్యూనిటీ రిపోర్టింగ్ టూల్ గురించి అవగాహనను పెంచాలని తెలిపింది. రాష్ట్రాల మధ్య సమన్వయాన్ని పెంచుకోవాలని కూడా సూచించింది. ఈ సమావేశం కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి పుణ్య సలిల శ్రీవాస్తవ అధ్యక్షతన జరిగింది.

**స్రేసన్ ఫార్మాస్యూటికల్స్‌పై చర్యలకు సిఫారసు**

ఎపిడమాలజిస్టులు, మైక్రో బయాలజిస్టులు, ఎంటమాలజిస్టులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లతో కూడిన కేంద్ర నిపుణుల బృందం మధ్య ప్రదేశ్‌లోని ఛింద్వారా, నాగపూర్‌లలో పర్యటించింది. బాలల మరణాలపై రాష్ట్ర అధికారులతో సమన్వయం చేసుకుని, విశ్లేషణ జరిపింది. క్లినికల్, ఎన్విరాన్‌మెంటల్, ఎంటమాలాజికల్, డ్రగ్ శాంపిల్స్‌ను సేకరించి, పుణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ, నాగపూర్‌లోని ఎన్ఈఈఆర్ఐ, ముంబైలోని సెంట్రల్ డ్రగ్ లేబరేటరీలకు పంపించింది. సాధారణ అంటు వ్యాధుల అవకాశాలను ప్రాథమిక పరీక్షల ఫలితాలు తోసిపుచ్చాయి. ఒక కేసులో మాత్రమే లెప్టోస్పిరోసిస్ పాజిటివ్ కనిపించింది. చిన్నారులు వాడిన 19 మెడిసిన్ శాంపిల్స్‌ను ప్రైవేట్ ప్రాక్టీషనర్స్, సమీపంలోని రిటెయిల్ స్టోర్స్ నుంచి సేకరించారు. 10 శాంపిల్స్ కెమికల్ విశ్లేషణలో 9 నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్లు వెల్లడైంది. కోల్డ్రిఫ్ దగ్గు మందులో డీఈజీ అనుమతించదగిన పరిమితి కన్నా అధికంగా ఉన్నట్లు వెల్లడైంది. దీంతో కోల్డ్రిఫ్‌ను తయారు చేస్తున్న స్రేసన్ ఫార్మాస్యూటికల్స్ కంపెనీపై తమిళనాడు రెగ్యులేటరీ అథారిటీ ఎఫ్‌డీఏ చర్యలు తీసుకుంది. దీని లైసెన్సును రద్దు చేయాలని సీడీఎస్‌సీఓ సిఫారసు చేసింది. ఈ కంపెనీపై క్రిమినల్ చర్యలను కూడా ప్రారంభించారు.

# మహనీయుల స్ఫూర్తిని మనమంతా ఆదర్శంగా తీసుకోవాలి

**-జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**
**-జి.వెంకట స్వామి (కాక) జయంతి వేడుకలలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**



**అక్షర వేదం ప్రతినిధి:పెద్దపల్లి, అక్టోబర్-05:** మహనీయుల స్ఫూర్తిని మనమంతా ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.ఆదివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించిన జి.వెంకట స్వామి (కాక) జయంతి వేడుకలలో అదనపు కలెక్టర్ లు జే.అరుణ శ్రీతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మారు మూల ప్రాంతంలో జన్మించినప్పటికీ జీవితంలో గొప్ప స్థాయికి ఎదిగిన మహనీయులు జి.వెంకట స్వామి (కాక) కేంద్ర మంత్రిగా, వివిధ పదవులు చేపట్టి, ప్రజలకు సేవ చేశారని, అటువంటి మహనీయులు మన ప్రాంతంలో జన్మించడం మనందరికీ గర్వ కారణమని అన్నారు. జి.వెంకట స్వామి అందించిన స్ఫూర్తితో మనందరం పని చేయాలని, విధులు నిర్వహించే సమయంలో అట్టడుగు వర్గాల వారికి మన వంతు సహకారం అందేలా చూడాలని కలెక్టర్ సూచించారు. మన ప్రాంతంలోని పేదలకు వెంకటస్వామి అనేక సేవలు అందించారని, ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయడంలో కీలకపాత్ర పోషించారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర స్థాయి ప్రభుత్వాలలో కీలక పాత్ర పోషించి, పేదల అభ్యున్నతి కోసం, తెలంగాణ రాష్ట్రం కోసం నిరంతరం తపించి పని చేశారని, తెలంగాణ సమాజం పడే బాధలను అర్థం చేసుకున్నారని, ప్రజల కష్టాల నివారణకు కృషి చేశారని అన్నారు. కోల్ బెల్ట్ ఏరియాలో కార్మికుల గుండెల్లో చిరస్థాయి స్థానం పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు ఎస్.సి. డెవలప్మెంట్ రవీందర్,జిల్లా క్రీడల అధికారి సురేష్ ,ఆర్డీవోలు గంగయ్య, సురేష్, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్,కలెక్టరేట్ సూపర్డెంట్ లు ప్రకాష్, కేవై ప్రసాద్, కలెక్టరేట్ సిబ్బంది,జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వట్టె జానయ్య యాదవ్ కి ఘన సన్మానం

**- యాదవ హక్కుల పోరాట సమితి**
**- జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ ఆధ్వర్యంలో.**
**సన్మానించిన జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి.**





**అక్షర వేదం/హైదరాబాద్/ బషీర్ బాగ్:అక్టోబర్ 05,** హైదరాబాద్ లోని బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో బీసీ ఉద్యమ నేత 78 కేసులు పెట్టిన అలుపెరుగక అహర్నిశలు బడుగు బలహీన వర్గాల కోసం శ్రమిస్తున్న టి ఆర్ పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్ ని ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా వట్టి జానయ్య యాదవ్ మాట్లాడుతూ యాదవులంతా ఏకమై మన రాజ్యం తెచ్చుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మేకల రాములు యాదవ్,యాదవ హక్కుల పోరాట సమితి తెలంగాణ అధ్యక్షులు దేవేందర్ యాదవ్,వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శ్రీనివాస్ యాదవ్,మహిళ అధ్యక్షురాలు లక్ష్మి, టి ఆర్ పి ప్రధాన కార్యదర్శి సంఘం సూర్యారావు,బైకాని శ్రీశైలం యాదవ్,సర్పంచ్ ల ఫోరమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశబోయిన మల్లయ్య యాదవ్, టి ఆర్ పి నాయకులు కుంభం నాగరాజు, బోడుప్పల్ యాదవ సంఘం నాయకులు కొండ ఐలయ్య, నర్సింగ్ యాదవ్, వెంకన్న యాదవ్, మల్లికార్జున యాదవ్, కృష్ణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ ఏకైక కూతురు తేజస్విని వివాహ నిశ్చితార్థవేడుక...



**అక్షర వేదం/మహబూబాబాద్ నియోజకవర్గం :-అక్టోబర్ 5.** మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్-డాక్టర్ సీతామహాలక్ష్మి దంపతుల ఏకైక కూతురు తేజస్విని వివాహ నిశ్చితార్థవేడుక..తన చెల్లెలు కుమారుడు, మేనల్లుడు కుమార్ కు తన కూతురు తేజస్విని ని ఇచ్చి వివాహం చేస్తున్న మాజీఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్..తన స్వగ్రామం బాలాజీతండాలో కుటుంబసభ్యుల మధ్య వివాహ నిశ్చితార్థవేడుక...

## జాతీయఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా సత్యనారాయణ....




**అక్షర వేదం ప్రతినిధి:పెద్దపల్లి అక్టోబర్ 05** జాతీయ ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా బొల్లి సత్యనారాయణ అవార్డు అందుకున్నారు. అక్టోబర్ 5 ఆదివారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వాగేశ్వరి డిగ్రీ,పీజీ కళాశాలలో నిర్వహించిన గురుస్ స్టూడెం ట్స్, పేరెంట్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడాకారులను తయారు చేస్తూ విశిష్ట సేవలు అందించిన సుల్తానాబాద్ పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బొల్లి సత్యనారాయణ ను గురుస్ స్టూడెంట్స్, పేరెంట్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఇండియా చైర్మన్,జాతీయ అధ్యక్షుడు గంగారపు మల్లేశం తో పాటు సంస్థ ప్రతినిధులు, ఉత్తమ ఉపాధ్యాయుడుగా ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందించి ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గురుస్ సంస్థ ప్రతినిధులకు బొల్లి సత్యనారాయణ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## నూతన వస్త్రాలంకరణ కార్యక్రమానికి హాజరై ఆశీస్సులు అందజేసిన

**- టియుడబ్ల్యూజే(ఐజేయు) జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్.**



**అక్షర వేదం /బయ్యారం మండలం ,గందంపల్లి:-అక్టోబర్ 5.** మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గందంపల్లిలో సీనియర్ జర్నలిస్ట్, వి6 న్యూస్ మహబూబాబాద్ రిపోర్టర్, రేఖ వర్మ యాదవ్ కూతురు నూతన వస్త్రాలంకరణ వేడుకకు హాజరై ఆశీస్సులు అందజేసిన టియుడబ్ల్యూజే(ఐజేయు) జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్, మజ్దూర్ యూనియన్ వరంగల్ బ్రాంచ్ సెక్రెటరీ యుగంధర్ యాదవ్, సీనియర్ జర్నలిస్ట్ లు రమణ, రాము, బాబురావు, బోనగిరి శ్రీనివాస్, అక్రమ్, జ్ఞానేందర్, ఉప్పలస్వామి తదితరులు..

## మంథనిలో ఘనంగా వెంకటస్వామి జయంతి



**అక్షర వేదం/మంథని,అక్టోబర్5:** మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి కాక 96వ జయంతి వేడుకలను మంథని లో ఆదివారం రోజున ఘనంగా నిర్వహించారు.పాత పెట్రోల్ బంకు వద్ద ఉన్న వెంకట స్వామి విగ్రహానికి మాల మహానాడు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఆ కార్యక్రమం అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో మంథని నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు..

## పోచమ్మ తల్లి విగ్రహ పునః ప్రతిష్టాపన



**అక్షర వేదం:అక్టోబర్ 05,రామగిరి.** ఆదివారం లద్నాపూర్ గ్రామంలో ఉన్న ఓసిపి క్వారీ పక్కన గల పోచమ్మ తల్లి విగ్రహం కొత్త గా సింగరేణి సహకారంతొ నిర్మాణం చేసిన గుడిలో బోనాలు డప్పుల చప్పుళ్లతో అమ్మవారిని తీసుకుని వచ్చి పునః ప్రతిష్ట గ్రామానికి చెందిన ప్రజలు,పంబాల ఆధ్వర్యంలో చేశారు.ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు,గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కు సన్మానం




**అక్షర వేదం అక్టోబర్ 5 రామగిరి** రామగిరి మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన రిటైర్డ్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ మల్కా రాజేశ్వరరావు- సుజాతలను ఆదివారం మాజీ సర్పంచ్ పల్లె.ప్రతిమ పీవీరావు ఘనంగా సన్మానించారు. కరీంనగర్ కెమిస్ట్రీ భవన్ లో జరిగిన రిటైర్మెంట్ సన్మాన కార్యక్రమంలో వారు పాల్గొని సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు కొప్పుల రవీందర్ రావు-అనిత పాల్గొన్నారు.

## విష జ్వరంతో వివాహిత మృతి



**అక్షర వేదం అక్టోబర్ 5 రామగిరి** రామగిరి మండలం పన్నూరు గ్రామానికి చెందిన చిందం శారద (38) సంవత్సరాల అనే వివాహిత విష జ్వరంతో ఆదివారం తెల్లవారు జామున హాస్పిటల్లో చికిత్స పొందుతు మృతి చెందింది. మృతురాలు శారద విష జ్వరంతో బాధపడుతు కరీంనగర్ అపోలో రీచ్ హాస్పిటల్ లో చేరగా పది రోజుల నుండి చికిత్స పొందుతు మృతి చెందింది. మృతురాలు భర్త శంకర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో పంప్ ఆపరేటర్ గా పనిచేస్తున్నాడు. మృతురాలికి ఒక కూతురు కలదు. మృతురాలు శారద మృతి పట్ల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. శారద మృతి పట్ల మాజీ జెడ్పిటిసి మేదరబోయిన శారద - కుమార్ యాదవ్, గంట వెంకటరమణ రెడ్డి, మాజీ సర్పంచ్ లు, పద్మ - తిరుపతి, పల్లె ప్రతిమ పివి రావు, మాజీ ఎంపీటీసీలు, ముత్యాల శ్రీనివాస్, పంజాల శ్రీనివాస్, మహేష్, మాజీ ఉపసర్పంచ్ దామర శ్రీనివాస్, విజ్జగిరి రాజు, సిద్ధం మురళీకృష్ణ, విజ్జగిరి భూమన్న, నాగుల శ్రీనివాస్, పిట్టల రాజమౌళి, కుంట శ్యాం కుమార్ ,సిద్ధం రాము, పెరుమాండ్ల ప్రసాద్, కుంట సమ్మయ్య, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

## ఆదివారహా దేవాలయానికి వీల్ చైర్, గ్రైండర్ అందించిన లక్ష్మణ్



**అక్షర వేదం అక్టోబర్ 5 రామగిరి** రామగిరి మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన ఆడప. లక్ష్మన్ కమాన్ పూర్ లోని "ఆది వారాహ స్వామి" దేవాలయానికి తన వంతుగా విరాళం అందించారు. గుడికి రూ.10 వేల విలువ చేసే వీల్ చేయిర్ (వృద్ధులు-వికలాంగులకు గుడి చుట్టూ ప్రదక్షిణాలు చేయుటకు), మిక్సర్ - గ్రాయిండర్ (అన్న దాన కార్యక్రమం చేయు వంట శాల కొరకు) అందచేశారు. ఈ కార్యక్రమంలో వేగోలపు మల్లగౌడ్ పాల్గొన్నారు. లక్ష్మన్ ను స్థానిక మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు అభినందించారు.

## సుప్రీం కోర్టు రిజర్వేషన్స్ ఖరారు చేసినట్టేనా

**అక్షర వేదం / కాటారం**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారం మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలలో బాగంగా ఎంపిటిసి జడ్పిటిసి ఎన్నికలకు నేనంటే నేను రెడీ అంటూ పల్లెలో రాజకీయ విశ్లేషణ, నెలకొంది ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేయడంతో యువత ముందుకు వచ్చి నేను అంటే నేను అని రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికల పోటీకి సిద్ధం అవుతున్నారు కుల సంఘాల వారిగా మద్దతు కూడగట్టుకుని ప్రయత్నంలో ఎప్పటినుండే సిద్ధం అవుతున్నారు స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయో లేదో అనే సందేహం కూడా ప్రతి ఒక్కరిలో నెలకొంది సుప్రీం కోర్టులో కేసు ఉన్నందున రిజర్వేషన్లు మళ్ళీ మొదటికి వస్తాయోనాన్న భయం మరి కొందరిలో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి ఏదేమైనా కాటారం మండలంలో కాంగ్రెస్ టిఆర్ఎస్ పార్టీలా నుండి పోటీకి సిద్ధం అవుతున్న యువతరం మాజీ నాయకులు నామినేషన్ వేసి గెలుస్తానని గట్టి నమ్మకంతోనే ఉన్నటు అనిపిస్తుంది సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం జరుగుతుందని మరికొందరి అంచనా దీనితో అధిష్టాన వర్గాలకు తలనొప్పి అయ్యే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు చెప్తున్నాయి

## ఘనంగా కాక వెంకటస్వామి జయంతి వేడుకలు




**అక్షర వేదం/ధర్మారం:**

మండల కేంద్రంలో కాక వెంకటస్వామి జయంతి వేడుకలను ధర్మారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై కాక చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు అనంతరం మంత్రి అడ్లూరి మాట్లాడుతూ నిరంతరం పేదల అభ్యున్నతి కోసం పాటుపడిన మహనీయుడని కాక సేవలను కొనియాడారు ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం కాక జయంతిని అధికారికంగా నిర్వహిస్తుందఅన్నారు అనంతరం చౌరస్తాలో పేదలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## జనసంద్రంగా మారిన శోభయాత్ర అట్టహాసంగా దుర్గా నిమజ్జనోత్సవం

**అక్షర వేదం ప్రతినిధి:కమాన్ పూర్ సెప్టెంబర్ 05:**



మండల కేంద్ర మైన కమాన్ పూర్ లో దుర్గ మాత నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. పది రోజులపాటు ఉపవాస దీక్షలతో పాటు నిత్యం ఉదయం సాయంత్రం భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, యజ్ఞ హెూమాలు, వివిధ రూపాలలో అమ్మవారిని అలంకరణ చేసి ఘనంగా పూజలు నిర్వహించారు. పది రోజుల అనంతరం ఆదివారం రోజున దుర్గామాతను ప్రత్యేకంగా అలంకరించి, మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మరియు సుభాష్ నగర్ యూత్, దుర్గామాత కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా శోభయాత్ర నిర్వహించారు. డీజే పాటలతో యువకులు, యువతులు, చిన్నారులు, మహిళలు కోలాటాలు వివిధ రకాల అలంకరణలతో నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా మండల కేంద్రంలోని వీధుల గుండా అమ్మవారి శోభాయాత్ర కొనసాగించడంతో, జై భవాని, జై దుర్గమాత అంటూ అమ్మవారి నామస్మరణ మార్మోగింది. అధిక సంఖ్యలో మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలుకుతూ టెంకాయ నివేదన గావించి వేడుకున్నారు. భక్తి ఆనందోత్సవాలతో నిండిన ఈ శోభయాత్రలో హైదరాబాద్ కు చెందిన ఉప్పల్ బాలు, కాచిగూడ ఐసు మాత టీం బృందం నృత్యా కారుల ప్రదర్శనలు గ్రామ ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. ఆదివారం సాయంత్రం ప్రారంభమైన దుర్గ మాత శోభయాత్ర అర్ధరాత్రి వరకు కొనసాగింది.అనంతరం గుండారం రిజర్వాయర్ (చెరువు)లో అమ్మవారిని నిమజ్జనం చేశారు.

## కాకా వెంకటస్వామి జయంతి ఉత్సవాలు

**అక్షర వేదం / మహాదేవాపూర్, అక్టోబర్ 5**




స్థానిక మహాదేవపూర్ మండల్ కేంద్రం లోని తెలంగాణా మాల మహానాడు జయశంకర్ భూపాలపల్లి జిల్లా యూత్ అధ్యక్షుడు మేరుగు శేఖర్ అద్వైర్యం లో కాకా వెంకస్వామి జయంతి ని పురాష్కరించడం జరిగింది స్థానిక మహాదేవపూర్ లో కాకా వెంకటస్వామి 96 వ జయంతి ని పురాష్కరించుకొని ఘనంగా కేక్ కట్ చేయడం జరిగింది ఇ కార్యక్రమం లో సీనియర్ అంబేద్కర్ సంఘము నాయకులు మేరుగు పెద్ద సమ్మయ్య మేరుగు మల్లయ్య తెలంగాణా మాల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేరుగు నరసింహా స్వామి అంబేద్కర్ సంఘము మాజీ అధ్యక్షులు చింతల వెంకటేశ్వర్లు మాల మహానాడు సీనియర్ నాయకులు రెవెల్లి రాజశేఖర్ ఇ కార్యక్రమం లో పాల్గొన్న లోకుల రాకేష్ మేరుగు నవీన్... మేరుగు రవీందర్. దాసరి రంజిత్ తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ లో అసమర్థులు, దొరగాడిల బానిసలు ఎన్నికల్లో నిలబడితే ఓడించండి...

**- సమర్థులు, నీతిపరులు, ప్రశ్నించే గొంతుకలు ఏకం కండి...పోటీలో నిలబడండి... సత్తా చూపండి**

**అక్షర వేదం /మరిపెడ మండలం ,డోర్నకల్ నియోజకవర్గం :-అక్టోబర్ 5.**



కష్టపడ్డ కాంగ్రెస్ నిజమైన కార్యకర్తలైన, నాయకులైన ఒకడు టికెట్ ఇచ్చేది ఏందీ...మీరే స్వతంత్రంగా నిల్చొండి.ఎవరు టికెట్ ఇచ్చేది... మీకు ప్రజలే గెలిపించి పదవి ఇస్తే పార్టీ మీ కిందికి వస్తుంది...

బహుజనులు ఈ ఎన్నికల్లో సత్తా చూపండి... ఎన్నికలకు సిద్ధం కండి...

డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుండి జిల్లా నాయకులు, రాష్ట్ర నాయకులు మేము ఎమ్మెల్యేలం మేము చెప్పిందే వేదం... మేము ఇస్తేనే పార్టీ టికెట్ అని అసమర్థులకు, దొరల గడీల బానిసలకు, దూ... దూ... బసవన్నలకు టికెట్స్ ఇస్తే ప్రతిగడించండి...లేదా ఎన్నికలు ఎదుర్కొంది... పోరాడితే ఎటువంటి నాయకుడైనా మట్టి కరువాల్సిందే... పార్టీ కోసం కష్ట కాలంలో ఉన్నవారిని, అప్పుడు, ఇప్పుడు ఉన్న నిజాయితీ పరులను, ముక్కుసూటిగా ఉన్న వారిని, ప్రశ్నించే తత్వం ఉన్నవారిని అనగాదొక్కే ఈ నాయకులకు వణుకు పుట్టాలి.... మీకోసం నేను ఉన్న అందరం ఒకే గొడుగు క్రింద ఒకే గుర్తుతో పోటీలో పాల్గొని ప్రచారం చేసి గెలుద్దాం.... జనరల్ సీటులో బహుజనులు(బీసీ, ఎస్సి, ఎస్టీ, మైనార్టీ వర్గాలు పోటీలో నిలబడాలి... ఇదే తరుణం మల్లి రాదు... వృద్ధ నాయకత్వం ఆనవాళ్లు లేకుండా చేద్దాం... గాడీల బానిసలు లేని... నీతి వంతం అయిన పాలన చేద్దాం... పక్కు రాజకీయాలకు, వారసత్వ రాజకీయాలకు పాతర వేద్దాం.... విద్యార్థి, యువత, మహిళలు మేల్కొనాలి..సాంప్రదాయంగా నాతతా... నా అయ్యా.... నేను అదే పార్టీ అనకుండా మంచి వ్యక్తి అయితే ఏ పార్టీ అయిన గెలిపించండి...కాంగ్రెస్ టికెట్ అడగండి... లేదంటే బరిలో గిరి గీసి పోరాడండి...ఓడిన నైతికంగా గెలుపే మీది అవుతుంది

డి. వై. గిరి
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి.
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
మహబూబాబాద్ జిల్లా.
సెల్ : 7013667743

# కాకా ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**- రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్**

**అక్షర వేదం/గోదావరిఖని : అక్టోబర్05**





దివంగత మహానేత, కేంద్ర మాజీ మంత్రి 'కాకా' వెంకటస్వామి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్ పిలుపునిచ్చారు. ఆదివారం వెంకటస్వామి 96వ జయంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గోదావరిఖని జీఎం ఆఫీస్ టర్నింగ్ వద్ద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే కాకా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో వెంకటస్వామి కృషి ఎంతో ఉందన్నారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమంలో ఆయన ప్రత్యక్షంగా, పరోక్షంగా కీలక పాత్ర పోషించారని చెప్పారు. అధికారంలో ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వాన్ని ఒప్పించడంలో తనదైన శైలిలో విశేష కృషి జరిపారని తెలిపారు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డిని సైతం ఎదిరించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఆరాటపడిన వ్యక్తి వెంకటస్వామి అని కొనియాడారు. పేద ప్రజల కోసం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కాకా చేసిన కృషిని ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరని తెలిపారు. బడుగు, బలహీన వర్గాలను బాగు చేయాలన్న కాకా ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ లీడర్లు పి.మల్లికార్జున్, గుమ్మడి కుమారస్వామి, బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, కాల్వ లింగస్వామి, దీటి బాలరాజు, రాచకొండ కోటేశ్వర్లు, దుబాసి మల్లేష్, పాకాల గోవర్ధన్ రెడ్డి, మల్లేష్ యాదవ్, ఎండి ముస్తాఫా, కల్వల సంజీవ్, నర్సింగ్ దొర, గట్ల రమేష్, తిప్పారపు మధు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం రామగుండం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గోదావరిఖని మెయిన్ చౌరస్తాలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు కె.రాజేందర్, బంక రామస్వామి, తదితరులు పాల్గొన్నారు. రామగుండం పట్టణం రైల్వే స్టేషన్ ఏరియాలో రైల్వే బోర్డు మెంబర్ అనుమాస శ్రీనివాస్ (జీన్స్) ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అనంతరం అన్నదానం చేశారు. బసంత్ నగర్ కన్నాల గ్రామంలో కాంగ్రెస్ లీడర్ తొగరి తిరుపతి, పాలకుర్తిలో నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో కాకా జయంతి సందర్భంగా అన్నదానం చేశారు. అంతర్గాం మండల కేంద్రంలో రవి, తాజ్, ఎన్టీపీసీలో జావెద్, యైటింక్లయిన్ కాలనీలో సలావుద్దీన్ ఆధ్వర్యంలో ప్రాంతాలలో కూడా కాకా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# డబుల్ ఇంజిన్ కాదు బిజెపి డబుల్ దోపిడి సర్కార్





**'ప్రమాదంలో ప్రజాస్వామ్యం' సిపిఎం భూ పోరాట కేంద్రం గుడిసె వాసుల సమావేశంలో సుర్నపు సోమయ్య**

**అక్షర వేదం/మహబూబాబాద్ జిల్లా :-అక్టోబర్ 5 .**

ఈ రోజు సమావేశం సిపిఎం పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్య అతిధిగా....సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుసుర్నపు సోమయ్య పాల్గొని మాట్లాడుతూ... 'మన దేశ రాజ్యాంగంలో ప్రజాస్వామ్యం ఉంది... రాజ్యాంగాన్ని కాపాడుకుంటేనే ప్రజాస్వామ్యం మనగలుగుతుంది.. ప్రజాస్వామ్యం ఉంటేనే ప్రశ్నించగలం' అని చసిపిఎం జిల్లా నాయకులు సోమయ్య అన్నారు. హెచ్1బి వీసాల పేరుతో మన ఉద్యోగులను, సుంకాల పేరుతో మన దేశ ప్రజలను ట్రంపు సర్కారు ఇబ్బందులకు గురిచేస్తుంటే ప్రధాని మోడీ మౌనం ఎందుకు దాల్చారని ప్రశ్నించారు.కేంద్రం నాణెం విడుదల.. రాజ్యాంగానికి తీవ్ర అవమానం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్న (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాల సందర్భంగా బుధవారం ప్రధాని నరేంద్ర మోడీ పోస్టేజీ స్టాంపుతోపాటు వంద రూపాయల నాణేన్ని విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని కేరళ ముఖ్యమంత్రి పినరరు విజయమన్ కూడా తీవ్రంగా విమర్శించారు. ఈ చర్య మన రాజ్యాంగానికి జరిగిన తీవ్ర అవమానంగా ఆయన అభివర్ణించిన విషయం మనకు తెలిసినదే,స్వాతంత్ర్య పోరాటానికి దూరంగా ఉన్న సంస్థ (ఆర్ఎస్ఎస్)ను చట్టబద్ధం చేయడానికి విభజించు పాలించు అన్న వలసవాద బ్రిటీష్ భావజాలాన్ని ప్రోత్సహించడానికి కేంద్రం చేస్తున్న ప్రయత్నమని అన్నారు సామాజిక మాధ్యమం జాతీయ గౌరవం అంటే మన నిజమైన స్వాతంత్ర్య సమరయోధుల జ్ఞాపకాలు, వారు ఊహించిన లౌకిక, ఏకీకృత భారతదేశం.అలాంటి జాతీయ గౌరవం పైన వారు (ఆర్ఎస్ఎస్, బిజేపి) చేస్తున్న ప్రత్యక్షంగా దాడి చేస్తున్నారని అని అన్నారు . గురువారం (అక్టోబర్ 2) గాంధీ జయంతి రోజు. భారతదేశానికి స్వాతంత్ర్య తెచ్చిపెట్టిన అలాంటి మహనీయుని జయంతి ముందు రోజున ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు జరుపుకోవడం.. వాటికి కేంద్రం మద్దతు ఇవ్వడం అంటే.. భవిష్యత్తులో భారతదేశ లౌకిక రాజకీయాలకు.. మితవాద పోరాట హిందూ జాతీయవాదం వల్ల ప్రమాదాలు సంభవిస్తాయని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.మతోన్మాద హంతకులు.. ఏకరూప హిందూ దేశం అనే వారి దృక్పథాన్ని రుద్దడానికి గాంధీ విలువలు ఒక బలీయమైన సైద్ధాంతిక, రాజకీయ అవరోధంగా భావించారు. అందుకే ఆయన్ని కాల్చి చంపారు. భారతదేశాన్ని లౌకిక, సమ్మిళిత, బహుళత్వ దేశంగా భావించినందుకే గాంధీ అమరవీరుడయ్యాడు. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా కేంద్రం స్టాంప్ నాణేములను విడుదల చేసింది .అలాంటి మహాత్మాగాంధీ జ్ఞాపకానికి కూడా ఆర్ఎస్ఎస్ భయపడుతుంది. గాంధీ హత్య కేసులో విచారణ ఎదుర్కొన్న ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త వినాయక్ దామోదర్ సావర్కర్‌ను భారత స్వాతంత్ర్యోద్యమ నిజమైన నాయకుడిగా.. గాంధీ స్థానంలోకి తీసుకురావాలని, బిజేపి కేంద్ర ప్రభుత్వం చరిత్రను తిరిగి రాయాలని చూస్తోందని విమర్శించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చెయ్యాలని కోరారు. ఇండ్లులేని నీరు పేదలను గుర్తించి ఇంటి పట్టాలతో పాటు ఇందిరమ్మా ఇండ్లు కట్టించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శులు గుడిసె వాసులు తదితరులు పాల్గొన్నారు..

# సాగర్ ప్రాజెక్టుకు తగ్గిన వరద

**-ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు మూసివేసిన అధికారులు**
**-ప్రాజెక్టు జలవిద్యుత్ కుడి,ఎడమ కాలువ ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల**
**-జలాశయం నీటిమట్టం 587.50 అడుగులు**



**నాగార్జునసాగర్ ,అక్షర వేదం**
నాగార్జునసాగర్ జలాశయానికి స్వల్పంగా వరద నీరు తగ్గడంతో ప్రాజెక్ట్ అధికారులు ఆదివారం సాయంత్రము క్రస్ట్ గేట్లను మూసివేశారు.
ఎగువనున్న శ్రీశైలం ప్రాజెక్టు జలవిద్యుత్ కేంద్రాల ద్వారా నీటి విడుదల కొనసాగుతుంది.ఈ నేపథ్యంలో సాగర్ ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో 55,131,క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది,సాగర్ ప్రాజెక్టు ప్రధాన జలవిద్యుత్,కుడి,ఎడమ కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతున్నాయి.ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులుకాగా ప్రస్తుత నీటిమట్టం587.50,అడుగులుగా ఉంది.ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా ప్రస్తుతం 305.8030టీఎంసీల నీరు ప్రాజెక్టులో నిలువ ఉంది.కుడి కాల్వ ద్వారా 10,040,క్యూసెక్కులుఎడమ కాల్వ ద్వారా 8,896,క్యూసెక్కులు ,మెయిన్ పవర్ హౌస్ ద్వారా 33,495, క్యూసెక్కులు ఎస్.ఎల్. బీసీ ద్వారా 2400,క్యూసెక్కులు వరద కాలువ ద్వారా 300 క్యూసెక్కులు,నీటి విడుదల కొనసాగుతుంది.ప్రాజెక్ట్ నుంచి పూర్తిస్థాయి నీటి విడుదల 55,131 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవు తుంది.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి గ్రామాలను అభివృద్ధి పరచుకుందాం

**- ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి**



**జోగులాంబ గద్వాల జిల్లా,అక్షర వేదం**
గద్వాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ నందు మల్దకల్ మండలంలోని నాయకులు కార్యకర్తలు సమావేశంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల.కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు.త్వరలోనే జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కి జిల్లా సీనియర్ నేతలు మాజీ ఎంపీపీ,మాజీ జడ్పిటిసి ప్రభాకర్ రెడ్డి,సింగిల్ విండో ఛైర్మన్,నాయకులు శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా సత్కరించారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యే బండ్ల.కృష్ణ మోహన్ రెడ్డి మాట్లాడుతూ....త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడం జరుగుతుందని,గ్రామాలలో నాయకులు కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఎమ్మెల్యే ఎన్నికలలో నా గెలుపు కోసం కృషిచేసి నన్ను గెలిపించిన ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు.ఇప్పుడు మీ ఎన్నికలు స్థానిక సమస్య ఎన్నికలు రావడం జరిగింది.ప్రతి ఒక్కరికి అవకాశాలు వచ్చే విధంగా వారి గ్రామాల రిజర్వేషన్ల అనుకూలంగా స్థానిక నాయకత్వం బట్టి ప్రతి ఒక్కరికి అవకాశం కల్పించే విధంగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.త్వరలో జరగబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు కలిసికట్టుగా పనిచేసి ఎంపీటీసీ, జడ్పిటిసి,సర్పంచుల అభ్యర్థులను గెలిపించి భవిష్యత్తులో గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకునే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.ప్రతి ఒక్క కార్యకర్తలు గుండెల్లో పెట్టుకొని కాపాడుకునే బాధ్యత నాదే అని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి , జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ జంబు రామన్ గౌడు మాజీ ఎంపీపీ రాజారెడ్డి, మాజీ జడ్పిటిసి ప్రభాకర్ రెడ్డి,సింగిల్ విండో ఛైర్మన్ తిమ్మారెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు,సీనియర్ నాయకులు, కార్యకర్తలు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి

**- శంకర్ పల్లి మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో**
**- కాంగ్రెస్ పార్టీ చేవెళ్ళ నియోజకవర్గ ఇంచార్జి భీమ్ భరత్ పిలుపు**





**చేవెళ్ళ, అక్షర వేదం**
స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జి పామెన భీం భారత్ అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ళ నియోజకవర్గ పరిధిలోని శంకర్ పల్లిలో మండల పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి భీం భరత్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని భీం భరత్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల మద్దతు పుష్కలంగా ఉందని స్పష్టం చేశారు. ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకు లందరూ కలిసి కట్టుగా విజయం కోసం కృషిచేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన వారికి భవిష్యత్తులో మంచి ఫలితం ఉంటుందన్నారు . ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజ ల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్, వార్డు మెంబర్లలో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకోవాలని ఆ విధంగా నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలోనే ప్రజలకు మేలు జరుగుతుందని ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ప్రజలు గుర్తిస్తున్నారని కూడా వివరించారు. గత ప్రభుత్వం చేసిన మోసాలను కూడా ప్రజలకు అర్థమయ్యేలా వివరించాల్సిన బాధ్యత నాయకులపైనే ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జాతీయ నాయకులు, రాష్ట్ర నాయకులు మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు ,మండల నాయకులు ,మాజీ సర్పంచ్లు మాజీ ఎంపీటీసీ లు తదితర నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.


# గెలుపు గుర్రాలపై దృష్టి సారించండి.

**-అన్ని స్థానాల్లో కాంగ్రెస్ గెలవాలి.**
**-జిల్లా ఇన్చార్జి ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల బాబు.**



**మహేశ్వరం, అక్షర వేదం**
గెలుపు గుర్రాలపై దృష్టి సారించాలని, అన్ని సీట్లలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిపించే విధంగా కృషి చేయాలని జిల్లా ఇన్చార్జి, ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చల్ల నరసింహారెడ్డి, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, శంకర్, నారాయణ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, భీమ్ భరత్, మహేశ్వరం ఇన్చార్జి కే ఎల్ ఆర్ లతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికలలో క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకుపోయే విధంగా కృషి చేయాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యేలు, ఇన్చార్జులు సమన్వయంతో పనిచేసి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆయన కోరారు. గత ప్రభుత్వంలో జరిగిన వైఫల్యాలను, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు వాటి అన్నింటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆయన చెప్పారు. నియోజకవర్గాలలో అభ్యర్థుల ఎంపికలో సర్వే నిర్వహించిన తర్వాతనే అధిష్టానం తుది ప్రకటన చేస్తుందని ఆయన పేర్కొన్నారు. గ్రూపులకు తావియ్యకుండా గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వానికి పట్టుకొమ్మలు గ్రామాలని ఆ గ్రామాలను పటిష్టపరిచే విధంగా నాయకులు కృషి చేయాలని ఆయన సూచించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించి, ఎస్సీ ఎస్టీ మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేయడం జరిగిందని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పార్టీ అభ్యర్థుల గెలుపుకు నాంది పలుకుతాయని ఆయన ధీమా వ్యక్తపరిచారు. ప్రతి కార్యకర్త ఒక సైనికుని వలె పని చేయాలని ఆయన సూచించారు.

## ప్రభుత్వ విప్, డిప్యూటీ స్పీకర్ డా. రామచంద్రనాయక్ ఆధ్వర్యంలో నేడు మరిపెడలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం!



**అక్షర వేదం/ మరిపెడ :- అక్టోబర్ 5.**
నేడు (సోమవారం) 06-10-2025, మధ్యాహ్నం 1:00 గంటకు కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరగనుంది.ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో పార్టీ కార్యకలాపాల సమీక్ష, భవిష్యత్ కార్యాచరణ, బూత్ స్థాయి బలపరచడం తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చ జరగనుంది.ఈ సమావేశానికి మండల కాంగ్రెస్ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, యూత్ అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, మాజీ వార్డ్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, సోషల్ మీడియా విభాగం అందరూ హాజరు కాగలరు.మరిపెడ మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమయానికి హాజరై సమావేశాన్ని విజయవంతం చేయగలరు.ఇట్లు పెండ్లి రఘువీర్ రెడ్డి మండల అధ్యక్షులు మరిపెడ

## నేడు ప్రజావాణి కార్యక్రమం రద్దు.....

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**అక్షర వేదం ప్రతినిధి పెద్దపల్లి, అక్టోబర్ 05:**
కలెక్టరేట్లో సోమవారం నాడు (06.10.2025) నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు వినతులు ఇవ్వడానికి కలెక్టరేట్ కు రావద్దని విజ్ఞప్తి చేశారు. పంచాయతీ ఎన్నికలు మాడల్ కోడ్ అమలులో ఉన్నందున అధికారులంతా క్షేత్రస్థాయిలో ఎన్నికల విధులలో ఉన్నందున ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## బి.ఆర్.ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్



**అక్షర వేదం/దంతాలపల్లి మండలం:-అక్టోబర్ 5.**
దంతాల పల్లి మండల కేంద్రం లో జరిగిన బి.ఆర్.ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో లక్ష్మీపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తారమ్మ భిక్షం ఆంజనేయులుని బి.ఆర్.ఎస్ పార్టీ లోకి చేర్చుకొని అనంతరం ప్రసంగిస్తున్న డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే శ్రీ డిఎస్ రెడ్యానాయక్ నూకల వెంకటేశ్వర రెడ్డి , ఓలాద్రి మల్లారెడ్డి ,నూకల గౌతంరెడ్డి ,ధర్మవరపు వేణు ,నాగిరెడ్డి వెంకట్ రెడ్డి , వీరబోయిన కిషోర్ ,కుక్కడం రాము గౌడ్ .


## దొంతి కాంతమ్మ పార్థివ దేహానికి నివాళులర్పించిన

**ప్రభుత్వ విప్ డా.రామచంద్రనాయక్, ఎంపీ పోరిక బలరాం నాయక్**



**అక్షర వేదం /డోర్నకల్ నియోజకవర్గం:-అక్టోబర్ 5.**
నర్సంపేట శాసనసభ్యులు శ్రీ దొంతి మాధవరెడ్డి తల్లి, శ్రీమతి దొంతి కాంతమ్మ శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషాద సమయంలో, హన్మకొండలోని వారి నివాసంలో పార్థివదేహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంలో ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ మరియు మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ పాల్గొని, కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని అర్పించారు.కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న లోటును వ్యక్తం చేస్తూ, ఆమె సేవలు, ఆత్మీయత మరియు కృషికి గౌరవం తెలిపి, నివాళులు అర్పించారు.

## చిన్నారుల నుంచి పెద్దల వరకు: స్మార్ట్‌ఫోన్ అడిక్షన్ ప్రమాదం, భవిష్యత్తు తరాలకు శాపం!




**అక్షర వేదం/స్పెషల్ న్యూస్:-అక్టోబర్ 5.**
తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, కళాశాల ల ఆచార్యులకు విజ్ఞప్తి...
చిన్న, చిన్న పిల్లలను, చదువుకుంటున్న విద్యార్థులను వీలయినంత వరకు సెల్ ఫోన్ కు, సోషల్ మీడియాకు దూరంగా ఉంచండి..., వారి భవిష్యత్తును, మానసిక, శారీరక ఆరోగ్యాన్ని కాపాడండి...ప్రయత్నం చేయండి.., ఒకటికి పదిసార్లు ఈ.. విషయాన్ని ప్రచారం చేయండి..., కొందరు మారినా చాలు...

# బిజినెస్

## శాసంగ్ నుంచి 3 బడ్జెట్ ఫోన్స్ రిలీజ్!

### ఫీచర్లు మైండ్ బ్లోయింగ్!



శాంసంగ్ నుంచి 07 సిరీస్ లాంఛ్ అయింది. ఈ సిరీస్ లో భాగంగా శాంసంగ్ గెలాక్సీ ఎ07(A07), గెలాక్సీ ఎఫ్07(F07), గెలాక్సీ ఎమ్ 07 (M07) ఫోన్లు మార్కెట్లో లాంఛ్ అయ్యాయి. ఇందులో ఎమ్ సిరీస్ అమెజాన్ లో లభిస్తుండగా ఎఫ్ సిరీస్ ఓన్లీ ఫ్లిప్ కార్ట్ లోనే అందుబాటులో ఉంటుంది. ఈ మొబైళ్ల ఫీచర్ల విషయానికొస్తే..ఫీచర్లు శాసంగ్ కొత్త బడ్జెట్ స్మార్ట్‌ఫోన్ సిరీస్ లో వచ్చే మూడు ఫోన్లు దాదాపు ఒకేరకమైన ఫీచర్లు కలిగి ఉంటాయి. మూడింటిలో మీడియాటెక్ హీలియో జీ99 ప్రాసెసర్ ఉంటుంది. మూడు ఫోన్లు 6.7-అంగుళాల ఎల్సీడీ హెచ్ డీ ప్లస్ డిస్‌ప్లేను కలిగి ఉన్నాయి. ఈ డిస్ ప్లే 90హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్‌కు సపోర్ట్ చేస్తుంది. ఈ మొబైల్స్ కు ఐపీ54 డస్ట్ అండ్ స్ప్లాష్ రెసిస్టెన్స్ సపోర్ట్ ఉంటుంది.

**కెమెరా, బ్యాటరీ**

ఇక కెమెరాల విషయానికొస్తే.. ఈ మూడు ఫోన్స్ లో ఆటోఫోకస్‌తో కూడిన 50ఎంపీ ప్రైమరీ కెమెరా , 2ఎంపీ డెప్త్ సెన్సార్ ఉన్నాయి. ముందు భాగంలో 8 ఎంపీ సెల్ఫీ కెమెరా ఉంటుంది. ఈ మూడు ఫోన్లు 5,000 ఎంఏహెచ్ బ్యాటరీతో వస్తాయి. 25 వాట్ ఫాస్ట్ ఛార్జింగ్ ను సపోర్ట్ చేస్తాయి.

**ధరలు**

ఇకపోతే ఈ మూడు ఫోన్ల 4జీబీ ర్యామ్ 64జీబీ స్టోరేజ్ తో వస్తాయి. ఆండ్రాయిడ్ 15 వెర్షన్ పై రన్ అవుతాయి. ఆరేళ్లపాటు సాఫ్ట్ వేర్ అప్ డేట్స్, సెక్యూరిటీ అప్ డేట్స్ వస్తాయి. ఈ మూడు ఫోన్లలో ఉండే ఒకేఒక్క తేడా డిజైన్. డిజైన్, రంగులు ఈ మూడు ఫోన్లలో వేర్వేరుగా ఉంటాయి. ఇక ధరల విషయానికొస్తే.. ఏ07 ధర రూ.8,999, ఎఫ్07 ధర రూ.7,699, ఎమ్ 07 ధర రూ. 6,999 నుంచి ప్రారంభమవుతాయి.

## వాట్సాప్ యూజర్లకు గుడ్‌న్యూస్..

**త్వరలో అందుబాటులోకి డయలర్ హబ్ ఫీచర్..!**




ఇన్‌స్టంట్ మెసేజింగ్ ప్లాట్‌ఫారమ్ వాట్సాప్ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది మెటా కంపెనీ యాప్‌ను ఉపయోగిస్తున్నారు. వాట్సాప్‌కు 3.5 బిలియన్లకుపైగా యూజర్లు ఉన్నారు. మేసేజింగ్, ఫొటోలు, వీడియోలు, వాయిస్ కాల్స్, వీడియో కాల్స్, మనీ ట్రాన్స్‌ఫర్ ఫీచర్స్ ఉన్నాయి. అదే సమయంలో ఎప్పటికప్పుడు కొత్త కొత్త ఫీచర్స్‌ను తీసుకువస్తూ యూజర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నది. తాజాగా మరో ఫీచర్‌ను తీసుకురాబోతున్నది. ఈ డయలర్ హబ్ ఫీచర్ సాయంతో కాంటాక్ట్ నంబర్ సేవ్ చేసుకునే వీలు కల్పిస్తున్నది. అలాగే ప్రత్యేకంగా చాట్ విండోను సైతం ఓపెన్ చేయాల్సి అవసరం ఉండదు. చాలామంది తమ పనులపై ఎవరికైనా వాట్సాప్ కాల్ చేయాలనుకున్నప్పుడు ప్రస్తుతం నంబర్ సేవ్ చేసుకొని మాట్లాడుతుంటారు.కొత్త వ్యక్తులకు ఎక్కువ ఫోన్లు చేయాల్సిన వచ్చిన సమయంలో ప్రతిసారీ కాంటాక్ట్ నంబర్‌ను సేవ్ చేయాల్సిన ఇబ్బంది ఉంది. అదే సమయంలో మొబైల్ కాంటాక్ట్ లిస్ట్ భారీగా పెరుగుతుంది. వాట్సాప్ తీసుకువస్తున్న కొత్త అప్‌డేట్‌తో మీరు ఇకపై ఎవరికైనా కాల్ చేయడానికి చాట్‌ను ఓపెన్ చేయాల్సిన అవసరం గానీ.. నంబర్‌ను సేవ్ చేయాల్సిన పని ఉండదు. ఆండ్రాయిడ్, ఐవోఎస్ యూజర్ల కోసం కొత్త కాల్ హబ్ అన్ని కాలింగ్ ఫీచర్స్‌ను ఒకే చోటుకు తీసుకువస్తున్నది వాట్సాప్. యూజర్లు ఇకపై వేర్వేరు స్క్రీన్‌లకు నావిగేట్ చేయకుండా కాల్స్‌ను చేయొచ్చు. కాల్ షెడ్యూల్ పెట్టొచ్చు. డయలర్‌ను ఉపయోగించవచ్చు. కొత్త కాల్స్ ట్యాబ్ ఇప్పుడు ఏకీకృత ఇంటర్‌ఫేస్‌ను కలిగి ఉంది. ఇక్కడి నుంచే యూజర్లు నేరుగా కాల్ చేసుకోవచ్చు.కాల్స్‌ను కాల్‌లను షెడ్యూల్ చేయడంతో పాటు డయలర్ నుంచి నంబర్‌కి డయల్ చేయొచ్చు. ఈ మార్పు కాలింగ్‌ను వేగంగా, సులభతరంగా ఉండనున్నది. యూజర్లు మొదట కాల్స్ బటన్‌పై క్లిక్ చేయాల్సి. ఆ తర్వాత కుడివైపున పైన పస్ల్ గుర్తు కనిపిస్తుంది. ఇందులో న్యూ కాల్ లింక్, కాల్ ఏ నంబర్, న్యూ కాంటాక్ట్, షెడ్యూల్ కాల్స్ ఆప్షన్ కనిపిస్తాయి. ఇందులో ఇందులో కాల్ ఏ నంబర్‌పై క్లిక్ చేస్తే డయలర్ ఓపెన్ అవుతుంది. ఏ నంబర్‌కు అయితే ఫోన్ చేయాలనుకున్నారో ఆ నంబర్ నెంబర్‌ను ఎంటర్ చేసి కాల్ చేయవచ్చు. కాల్‌ను సైతం షెడ్యూల్ చేసుకునే వీలుంటుంది. కొత్త షెడ్యూలింగ్ ఫీచర్ ముందుగానే కాల్‌లను ప్లాన్ చేసుకోవడానికి, చాట్ ద్వారా వివరాలను పంచుకోవడానికి అనుమతి ఉంటుంది. ఇక బిజినెస్ అకౌంట్స్ ఇప్పుడు వెరిఫికేషన్ బ్యాడ్జ్ అందుకుంటాయి. ఖాతా నిజమైనదా? కదా? అని యూజర్లు సులభంగా గుర్తించేందుకు వీలుంటుంది. ఈ ఫీచర్ మోసాల బారినపడకుండా కాపాడుతుంది. కొత్త కాల్ హబ్ ఫీచర్ కాలింగ్‌ను సులభతరం చేస్తుంది.

## బంగారం ధర మరింత పైకి..



బంగారం ధర రోజూ పెరుగుతూ సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది . డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో (అక్టోబర్ 5న) 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 19, 400కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 1, 09, 450కి చేరింది .ఢ్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 19, 550కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 09, 600కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 19, 400కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 1, 09, 450కి చేరింది. వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే వంద రూపాయిల మేర తగ్గాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం

**దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం రేట్లు (10 గ్రాములకు) (24 క్యారెట్, 22 క్యారెట్)**

హైదరాబాద్‌లో రూ. 1, 19, 400, రూ. 1, 09, 450
విజయవాడలో రూ. 1, 19, 400, రూ. 1, 09, 450
ఢిల్లీలో రూ. 1, 19, 550, రూ. 1, 09, 600
ముంబైలో రూ. 1, 19, 400, రూ. 1, 09, 450
వడోదరలో రూ. 1, 19, 450, రూ. 1, 09, 500
కోల్‌కతాలో రూ. 1, 19, 400, రూ. 1, 09, 450
చెన్నైలో రూ. 1, 19, 400, రూ. 1, 09, 450
బెంగళూరులో రూ. 1, 19, 400, రూ. 1, 09, 450
కేరళలో రూ. 1, 19, 400, రూ. 1, 09, 450
పుణెలో రూ. 1, 19, 400, రూ. 1, 09, 450


## వరల్డ్ కప్‌లోనూ ‘నో హ్యాండ్‌షేక్’..

**పాక్ కెప్టెన్‌ను పట్టించుకోని హర్మన్‌ప్రీత్..!..**



ఆసియా కప్‌లో భారత క్రికెటర్లు పాకిస్థాన్ ఆటగాళ్లతో షేక్‌హ్యాండ్ చేయకపోవడం చూశాం. ఇప్పుడు మహిళల వరల్డ్ కప్ లోనూ భారత మహిళల జట్టు సైతం దాయాదితో నో హ్యాండ్‌షేక్ విధానాన్ని అనుసరించింది. గ్రూప్ దశ రెండో మ్యాచ్ టాస్ సమయంలో పాక్ కెప్టెన్ ఫాతిమా సనా తో హర్మన్‌ప్రీత్ కౌర్ కరచాలనం చేయలేదు. ఆమెను అసలు పట్టించుకోలేదు కూడా. టాస్ తర్వాత రిఫరీతో మాట్లాడి వెళ్లిపోయింది భారత సారథి. అంతేకాదు టాస్ సమయంలో గందరగోళం ఏర్పడినా సరే గొడవ చేయకుండా సరేలే అని హుందాగా ప్రవర్తించింది హర్మన్‌ప్రీత్.వరల్డ్ కప్ ఆరంభ పోరులో శ్రీలంకను చిత్తుగా ఓడించిన భారత జట్టు ఆదివారం పాకిస్థాన్‌ను ఢీ కొడుతోంది. కొలంబోలోని ప్రేమదాస మైదానంలో జరుగతున్న మ్యాచ్‌లో పాక్ క్రికెటర్లతో హ్యాండ్ షేక్ చేయొద్దని బీసీసీఐ ఆదేశాలు జారీ చేసింది. దాంతో.. హర్మన్‌ప్రీత్ దాయాది జట్టు నాయకురాలైన ఫాతిమా సనాతో కరచాలనం చేయలేదు. అంతేకాదు.. టాస్ సమయంలోనూ పెద్ద గందరగోళం ఏర్పడింది.. ముందుగా పాక్ సారథి ఫాతిమ టెయిల్స్ అని చెప్పింది.కానీ, రిఫరీ షాంద్రే ఫ్రిట్జ్, అనౌన్సర్ మెల్ జోన్స్‌కు మాత్రం ఆమె హెడ్స్ అన్నట్టుగా అర్ధం చేసుకున్నారు. తీరా హెడ్స్ పడగానే ఫాతిమా టాస్ గెలుపొందినట్టు రిఫరీ చెప్పింది. అయినా సరే హర్మన్‌ప్రీత్ కౌర్ అభ్యంతరం చెప్పలేదు. ఈ ఒక్క సంఘటనతో తన క్రీడాస్ఫూర్తిని చాటుకున్న భారత కెప్టెన్‌పై ప్రశంసలు కురుస్తున్నాయి.

## రెస్ట్ ఆఫ్ ఇండియాకు షాక్.. విదర్భదే ఇరానీ కప్



రంజీ ట్రోఫీ ఛాంపియన్ విదర్భ తమ జోరును చూపిస్తూ ఇరానీ కప్ నూ పట్టేసింది. బ్యాటర్లతో పాటు స్పిన్నర్ దూబే చెలరేగడంతో రెస్ట్ ఆఫ్ ఇండియా కు షాకిస్తూ మూడోసారి ట్రోఫీని అందుకుంది. 2018, 2019లో ఇరానీ కప్ విజేత అయిన విదర్భ ఈసారి కూడా ఛాంపియన్‌గా నిలిచింది. దూబే నాలుగు వికెట్లు తీసి ప్రత్యర్థిని కూల్చడంతో 93 పరుగుల తేడాతో గెలుపొందింది. శతకంతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన అథర్వ తైడే ‘ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్’గా ఎంపికయ్యాడు.విదర్భ నిర్దేశించిన 361 పరుగుల ఛేదనలో రెస్ట్ ఆఫ్ ఇండియాకు ఆదిలోనే షాక్ తగిలింది. 35/2తో ఐదో రోజు ఇన్నింగ్స్ కొనసాగించిన ఆ జట్టు ఐదో ఓవర్లోనే కెప్టెన్ రజత్ పాటిదార్ వికెట్ కోల్పోయింది. రుతురాజ్ గైక్వాడ్, ఇషాన్ కిషన్‌లు సైతం త్వరగా వెనుదిరగడంతో 80 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది రెస్ట్ ఆఫ్ ఇండియా. అనంతరం యశ్ ధుల్(92), సరాన్ష్ జైన్(29)లు ఆరో వికెట్‌కు 53 పరుగులు జోడించింది ఆదుకున్నారు.కానీ, జైన్ ఎల్బీగా ఔట్ కావడంతో 156/6తో లంచ్‌కు వెళ్లింది రెస్ట్ ఆఫ్ ఆండియా. ఆ తర్వాత మానవ్ సుతార్ (56), ధుల్ ద్వయం 103 పరుగుల భాగస్వామ్యంలో విదర్భను భయపెట్టారు. కానీ,సెంచరీకి చేరువైన ధుల్‌ను, అన్షుల్ కంబోజ్‌ను యశ్ ఠాకూర్ ఔట్ చేయడంతో ఆ జట్టు ఆశలు ఆవిరయ్యాయి. టీ బ్రేక్ లోపే రెస్ట్ ఆఫ్ ఇండియాను 267కు ఆలౌట్ చేసిన విదర్భ హ్యాట్రిక్ ట్రోఫీతో చరిత్ర సృష్టించింది.నాగ్‌పూర్‌లోని వీసీఏ స్టేడియంలో విదర్భ బౌలర్ల ధాటికి రెస్ట్ ఆఫ్ ఇండియా కుప్పకూలింది. తొలి వికెట్‌కు 52 పరుగుల శుభారంభం లభించినా సద్వినియోగం చేసుకోలేకపోయింది. కెప్టెన్ రజత్ పాటిదార్(66), అభిమన్యు ఈశ్వరన్(52)లు రాణించగా.. యశ్ ఠాకూర్ విజృంభణతో ఆ జట్టు214కే ఆలౌట్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో అథర్వ తైడే(143) మారథాన్ ఆటతో ఆదుకోగా.. యశ్ రాథోడ్(91) మెరవగా విదర్భ 312 రన్స్ చేసింది. రెస్ట్ ఆఫ్ ఇండియా బౌలర్లలో ఆకాశ్ దీప్ (3-51), సరన్ష్ జైన్(2-94)లు రాణించారు.

# స్పోర్ట్స్

## పాక్‌ను చిత్తుగా ఓడించిన టీమిండియా

**చెలరేగిన క్రాంతి, దీప్తి శర్మ..**



మహిళల వన్డే వరల్డ్ కప్‌లో భారత జట్టు రెండో విజయం నమోదు చేసింది. తొలిపోరులో శ్రీలంకకు షాకిచ్చిన టీమిండియా ఈసారి పాకిస్థాన్‌ను మట్టికరిపించింది. బ్యాటర్లు సమిష్టిగా రాణించడంతో పోరాడగలిగే స్కోర్ చేసిన హర్మన్‌ప్రీత్ సేన ఆ తర్వాత దాయాది పని పట్టింది. క్రాంతి గౌడ్ (3-20) స్నేహ్ రానా(2-38)లు చక్కని బౌలింగ్‌తో వికెట్లు వేట కొనసాగించారు. దీప్తి శర్మ(3-45) చివరి వికెట్ తీయడంతో 88 పరుగుల తేడాతో భారత్ జయభేరి మోగించింది. తద్వారా ఈ ఫార్మాట్‌లో చిరకాల ప్రత్యర్థిపై 12 విజయాలతో పైచేయి సాధించింది.






## పవన్ కల్యాణ్ 'ఓజీ' నుంచి 'కిస్ కిస్ బ్యాంగ్ బ్యాంగ్' సాంగ్ విడుదల

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'ఓజీ' నుంచి 'కిస్ కిస్ బ్యాంగ్ బ్యాంగ్' పాటను మేకర్స్ యూట్యూబ్ వేదికగా విడుదల చేశారు. నిజానికి ఈ పాట సినిమా విడుదల సమయంలో ఎడిటింగ్‌లో డిలీట్ చేయబడింది, కానీ అభిమానుల డిమాండ్‌తో తాజాగా దీనిని థియేటర్లలోకి తిరిగి తీసుకువచ్చారు. అయితే తాజాగా మేకర్స్ ఈ పాట యొక్క లిరికల్ వీడియోను సోషల్ మీడియాలో అధికారికంగా విడుదల చేశారు. డిజే టిల్లు భామ నేహా శెట్టి ఈ పాటలో నటించగా.. ఈ పాటను 'ఓజీ' గాయపడి చికిత్స పొందుతున్న సమయంలో, విలన్ ఓమీ గ్యాంగ్ సెలబ్రేట్ చేసుకునే సందర్భంలో చిత్రీకరించారు. ఈ పాటకు తమన్ ఎస్. స్వరాలు అందించగా, శ్రీజో సాహిత్యాన్ని అందించారు. సోహా, వాగ్దేవి, మధుబంతి బాగ్చీ ఈ పాటను ఆలపించారు. ఈ సినిమా రన్ టైమ్ ఎక్కువగా ఉండటం వలన, అలాగే కథకు అంతగా అవసరం లేదనే కారణంతో దర్శకుడు సుజిత్ మొదట్లో ఈ పాటను ఫైనల్ ఎడిట్ నుంచి తొలగించారు. అయితే, సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలవడంతో, థియేటర్లలో ప్రేక్షకులకు మరింత కిక్ ఇవ్వడానికి దీనిని సెప్టెంబర్ 30 రాత్రి షోల నుంచి మళ్లీ జోడించారు.

## ఆ సినిమాకు నా హృదయంలో ప్రత్యేక స్థానం..

### తెలుగు మూవీపై కయాదు లోహర్

డ్రాగన్ సినిమాతో తెలుగులో మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది కయాదు లోహర్. ఈ అస్సామీ సుందరి నెట్టింట పోస్ట్ పెట్టిందంటే చాలు కామెంట్స్, లైకుల వర్షం కురుస్తుంది. ఈ బ్యూటీ తాజాగా చెన్నైలో జరిగిన ఓ అవార్డ్స్ ఈవెంట్ సెర్మనీలో పాల్గొంది. ఈ సందర్భంగా తనకు బాగా ఇష్టమైన, స్ఫూర్తిని కలిగించే సినిమా ఏంటో చెప్పింది కయాదు లోహర్. ఇంతకీ ఆ సినిమా ఏంటనుకుంటున్నారా..? బాక్సాఫీస్‌ను షేక్ చేసిన కల్ట్ క్లాసిక్ ఏ మాయ చేశావే.తాను ఏ మాయ చేశావే తెలుగు, తమిళ వెర్షన్లకు వీరాభిమానినని.. మనస్సును కదిలించే స్టోరీ టెల్లింగ్ చాలా మందికి ప్రేరణ కలిగించేలా ఈ రొమాంటిక్ డ్రామా సాగుతుందని చెప్పింది కయాదు లోహర్. ఈ చిత్రానికి తన హృదయంలో ప్రత్యేక స్థానం ఉంటుందని చెప్పుకొచ్చింది. ఈ సినిమాలో త్రిష, శింబు (తమిళ వెర్షన్)లో అద్భుతంగా ఉంటుందని.. ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ ఆల్బమ్ ఆల్‌టైమ్ ఫేవరేట్ హిట్ లిస్టులో ఉంటుందని చెప్పుకొచ్చింది. కయాదు లోహర్ ప్రస్తుతం తమిళంలో మూడు, మలయాళంలో ఒక సినిమా చేస్తుంది.

## హైప్ పెంచుతోన్న రవితేజ, శ్రీలీల మాస్ జాతర పోస్టర్




టాలీవుడ్ యాక్టర్ రవితేజ కాంపౌండ్ నుంచి వస్తోన్న చిత్రం మాస్ జాతర . సామజవరగమన ఫేం రైటర్ భాను బొగవరపు దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ రవితేజ 75 గా వస్తోంది. ఈ మూవీ అక్టోబర్ 31న గ్రాండ్‌గా విడుదలవుతుందని ఇప్పటికే మేకర్స్ ప్రకటించారని తెలిసిందే. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్ మొదలుపెట్టారు.మాస్ జాతర నుంచి Hudiyo Hudiyo సాంగ్ అప్‌డేట్ అందిస్తూ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పాట ప్రోమోను సోమవారం ఉదయం 11:08 గంటలకు లాంచ్ చేస్తున్నట్టు ప్రకటించారు మేకర్స్. క్లాస్ అండ్ మాస్ లుక్‌లో రవితేజ, లంగావోణిలో శ్రీలీల డ్యాన్సింగ్ మూడ్‌లో ఉండటం చూడొచ్చు. మాస్ జాతర మాస్ బీట్స్.. మెలోడీ ట్రాక్‌ను ఫీలయ్యేందుకు రెడీగా ఉండండి అంటూ మేకర్స్ షేర్ చేసిన పోస్టర్ పాటపై హైప్ పెంచేస్తుంది. ఈ మూవీని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి బలగం ఫేమ్ భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నాడు. పేరు లక్ష్మణ భేరి.. ఆదాయం చెప్పను తియ్.. ఖర్చు లెక్క జెయ్యన్.. రాజ్యపూజ్యం అన్ లిమిటెడ్.. అవమానం జీరో అంటూ మాస్ జాతరపై అంచనాలు పెంచేస్తున్నాడు రవితేజ. ధమాకా లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత రవితేజ, శ్రీలీల కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి.

## నాగశౌర్య 'బ్యాడ్ బాయ్ కార్తిక్' టీజర్ వచ్చేది అప్పుడే.!

యువ హీరో నాగశౌర్య ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. గతంలో ఆయన నటించిన పలు సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశ పర్చడంతో ఎలాగైన హిట్ కొట్టాలానే కసితో ఉన్నాడు. ఈ క్రమంలోనే వరుస సినిమాలను ఓకే చేస్తున్నాడు. ఈ క్రమంలోనే కొత్త దర్శకుడు రామ్ దేశిన డైరెక్షన్‌లో నాగశౌర్య 'బ్యాడ్ బాయ్ కార్తిక్' అనే ఓ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నాడు. శ్రీవైష్ణవి ఫిల్మ్స్ పతాకంపై శ్రీనివాసరావు చింతలపూడి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. అయితే తాజాగా ఈ మూవీ నుంచి టీజర్ అప్‌డేట్‌ను పంచుకుంది చిత్రయూనిట్. ఈ సినిమా టీజర్‌ను రేపు ఉదయం 11.57 గంటలకు విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది.



## వాళ్ల ప్రవర్తన వేరేలా ఉంటుంది..

### షాకింగ్ విషయం చెప్పిన రాశీ ఖన్నా.. అసలేమైందంటే

టాలీవుడ్ క్రేజీ బ్యూటీ రాశి ఖన్నా.. ఊహలు గుసగుసలాడే సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది ఈ బబ్లీ బ్యూటీ. రాశీ ఖన్నా తెలుగులో వరుసగా సినిమాలు చేసింది. యంగ్ హీరోలకు జోడీగా నటిస్తూ దూసుకుపోయింది ఈ అమ్మడు. అలాగే తమిళ్ లోనూ ఛాన్స్ లు అందుకుంది. తెలుగులో స్టార్ హీరో ఎన్టీఆర్ నటించిన జై లవ కుశ సినిమాలోనూ నటించింది. కానీ ఈ అమ్మడు అంతగా అవకాశాలు రావడం లేదు. దాంతో ఇటీవలే బాలీవుడ్ లో ఓ వెబ్ సిరీస్ చేసింది. దాంతో ఇప్పుడు బాలీవుడ్ పైనే ఈ చిన్నది ఫోకస్ పెడుతుంది. దాంతో రాశీ ఖన్నా టాలీవుడ్ కు దూరం అవుతుంది అని అంటున్నారు కొందరు అభిమానులు. కానీ ఈ అమ్మడు అవకాశం వస్తే ఏ బాషలోనైనా నటించి మెప్పిస్తాను అంటుంది.ప్రస్తుతం యంగ్ బ్యూటీస్ వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు. వారికి గట్టిపోటీ ఇచ్చేలా రాశీ ఖన్నా కూడా గగ్లామర్ గేట్లు ఎత్తేసి కవ్విస్తుంది. ఈ మధ్య కాలంలో రాశిఖన్నా పోస్ట్ చేస్తున్న ఫోటోలు చూస్తే కుర్రకారుకు నిద్ర పట్టడం లేదు. ఆ రేంజ్ లో అందాలతో అదరగొడుతుంది ఈ ముద్దుగుమ్మ. ఇదిలా ఉంటే తాజగా రాశిఖన్నా చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.తాజాగా ఈ ముద్దుగుమ్మ మాట్లాడుతూ.. బాలీవుడ్ కు టాలీవుడ్ కు తేడా ఏంటో చెప్పింది. టాలీవుడ్ ఇండస్ట్రీలో షూటింగ్ కు 9 గంటలు పని చేయాల్సి ఉంటుంది. అదే బాలీవుడ్ సినిమాలకు ఏకంగా 12గంటలు పని చేయాల్సి ఉంటుందని తెలిపింది రాశీ ఖన్నా. టాలీవుడ్ కు బాలీవుడ్ కు చాలా తేడా ఉంటుంది. కానీ నాకు మాత్రం తెలుగు సినిమా ఇండస్ట్రీలోనే ఎక్కువ మంది అభిమానులు ఉన్నారు. సౌత్ ఇండస్ట్రీలోని నటీనటులు చాలా ప్రైవేట్ గా ఉంటారు. తమపని తాము చేసుకుంటూ ఉంటారు. అలాగే తాము చేసే పనిలో లీనమైపోయి డెడికేషన్ తో పనిచేస్తూ ఉంటారు. కానీ బాలీవుడ్ లో అలా కాదు.. అక్కడి వారు ఆడంబరానికి పోతారు.. సౌత్ నటీనటులుగా ప్రవర్తించరు అని చెప్పుకొచ్చింది రాశీ. ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి.